Rs. 12/- per copy

# విద్యార్థి జ్వాల

Vol. 28 - No.8

June 2022



8 లో
ఈజీ లైఫ్



20 లో
కుటుంబ సమస్యల్లో
విశ్వాస విద్యార్థులు



## జారిపోతావ్... జాగ్రత్త






# దైవిక జీవన శైలిని అలవర్చుకొందాం!

ఈ రోజుల్లో చేతిలో పుస్తకం ఉండని విద్యార్థి ఉంటాడేమోగానీ పాకెట్లో సెల్‌ఫోన్‌లేని కుర్రాళ్ళు అరుదు. స్మార్ట్‌ఫోన్‌లతో అంత విడదీయరాని బంధం మరి. నేటి విద్యార్థులకు 'ఫోమో' బెంగ పట్టుకుంది. అంటే 'ఫియర్ ఆఫ్ మిస్సింగ్ ఔట్'. ఫోన్‌ను క్షణం వదిలితే ఏదో మిస్ అవుతాం అనే బెంగ దీని ప్రధాన లక్షణం. నిద్రలేవగానే, క్లాస్‌రూమ్‌లో, బాత్‌రూమ్‌లో, రోడ్డుమీద, షాపింగ్‌కు వెళ్ళినా, అర్ధరాత్రి బెడ్ మీద ఉన్నా, ఎక్కడున్నా, ఏం చేస్తున్నా, సమయం ఏదైనా పదే పదే సెల్‌ఫోన్‌లోకి తొంగిచూస్తున్నారు. తాము అన్ని విషయాలు అప్‌డేట్‌గా ఉండాలనే ఆతృతతో అనుక్షణం స్మార్ట్‌ఫోన్స్, ల్యాప్‌టాప్, ట్యాబ్ మొదలగు వాటితో ఇంటర్నెట్ ఉపయోగిస్తూ ఆన్‌లైనే లోకంగా గడిపేస్తున్నారు. అతిముఖ్యమైన పనులు పెండింగ్ పడినా పర్వాలేదు. చదువుల్లో మార్కులు తగ్గుతున్నా పుస్తకం పట్టరు, చర్చ్‌లో ఆరాధన జరుగుతూ ఉన్నా ఇదే ధోరణి. "సెల్‌ఫోన్, కంప్యూటర్ లేదా మరో పరికరం మన అవసరం కోసం తయారు చేసినవి. వాటిని మనం ఆపరేట్ చేయాలేగాని అవి మనల్ని ఆపరేట్ చేసే స్థాయికి దిగజారకూడదు అని" సైకాలజిస్టులు చెబుతున్నారు. "నిద్రకు ముందు మొబైల్ చూసి, ఉదయం లేచిన వెంటనే మళ్ళీ చూస్తున్నారంటే మీరు గాడ్జెట్లకు బానిసే" అని బెన్ కార్టర్ అంటారు. ఇప్పుడు తల్లిదండ్రులను, పెద్దలను కలవరపెడుతున్న ఓ క్రొత్త ధోరణి, జీవనశైలి ఇది.

సమాజంలో ఎందరో విద్యార్థుల్లో ఈ ధోరణి, జీవనశైలిని గమనిస్తున్నాం. కొన్నిసార్లు విశ్వాస విద్యార్థులు, గ్రాడ్యుయేట్స్ కూడా వీటికి అతీతులు కాదనిపిస్తుంది. గంటల తరబడి స్నేహితులతో ఫోన్‌లో మాట్లాడటం, పదేపదే ఫోన్‌ను చూసుకొంటూ కూర్చోవడం చేస్తున్నారు. ఈ ధోరణి వల్ల దేవుడిచ్చిన అమూల్యమైన సమయాన్ని వ్యర్థపరచుకొంటున్నారు. అందరిలో ఉన్నా ఒంటరిగా ఉంటున్నారు. ఫోన్‌కు బానిసైన వ్యక్తి 10 నిమిషాల్లో సుమారు ముప్పైసార్లు ఫోన్ చెక్‌చేసుకుంటూ ఉంటాడని మానసిక శాస్త్రవేత్తలు చెబుతున్నారు. దీనివల్ల చదువు, పని మీద ఏకాగ్రత కోల్పోతూ, తరచూ అసహనానికి, మానసిన ఆదోళనకు గురవుతున్నారు. వ్యర్థమైన అలవాట్లను నిరోధించకపోతే, అవి త్వరలోనే అవసరాలుగా మారతాయని అంటాడు సెయింట్ అగస్టీన్.

మన చేతుల్లో బైబిల్ ఉండి కూడా తప్పు జరుగుతుంది అంటే అది గర్వం, బద్ధకం, నిర్లక్ష్యాల ఫలితమే అని అంటాడు మాథ్యూ హెన్రీ. గర్వం, బద్ధకం, నిర్లక్ష్యం గలవారికి దేవుని భయం, పెద్దల భయం అస్సలు ఉండదు. దేవునికి సమీపంగా ఉంటే మనకు ఏది తప్పో అర్థమౌతుంది. గనుక ఒక విశ్వాస విద్యార్థి, గ్రాడ్యుయేట్ అలవరచుకోవలసిన ఒక దైవిక జీవనశైలి – దేవునియందలి భయభక్తులు కలిగివుండడం (ప్రసంగి 12:13). దేవునియందు భయభక్తులు కలిగి ఉండటం అంటే ఆయనను ఘనపరచడం, ప్రేమించడం, విశ్వసించడం, లోబడడం, ఆయనతో సహవాసం కలిగి ఉండటం, చెడుతనాన్ని అసహ్యించుకోవడమే. దేవునియందు భయభక్తులు గల వ్యక్తులు ఆయనను హృదయపూర్వకంగా వెంబడిస్తారు, ఆయన మాటలకు వణుకుతారు, తక్షణ విధేయత చూపిస్తారు. దేవుని భయంలేని భక్తి వ్యర్థమే. గనుక విశ్వాసి లోకంలోని ధోరణులవైపు, జీవన శైలివైపు పరుగు లెత్తకుండా, దేవునియందు భయభక్తులు కలిగిఉండే జీవనశైలిని కలిగిఉందాం.

"దినములు చెడ్డవి గనుక, మీరు సమయమును పోనియ్యక సద్వినియోగము చేసుకొనుచు, అజ్ఞానుల వలె కాక, జ్ఞానులవలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి" (ఎఫెసీ 5:15). అలా ఉండుటకు త్రియేక దేవుడు మనకు సహాయము చేయునుగాక!

– పి. సునీల్ జాకబ్

# విద్యార్థి జ్వాల

Vol. 28, No.7 May 2022
A Publication of
UESI Publication Trust



EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Dr. J. Subbarao - Sec., Litt.Dept.



CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com



GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508

ANNUAL: GRADUATES - Rs.250
STUDENTS - Rs. 120
LIFE INLAND - Rs. 2000
LIFE OVERSEAS - US $ 150

VIDYARTHI JWALA ACCOUNT NO:

**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**


TOPICS:


July : Imitating Christ
August : Patriotism

**Note:** Please send your writeups on or before
**10th of every month**

**లో**కంలో ట్రెండ్స్, విలువలు శాశ్వతం కాదు. ఎప్పటికప్పుడు మారిపోతుంటాయి, ఇవి వ్యక్తిలో నైతికతను ఏమాత్రం పెంచలేకపోగా పతనంవైపుకు తీసుకెళతాయి. బైబిల్ సత్యాలు, క్రీస్తు విలువలు ఎప్పటికీ మారవు. వీటిని అనుసరించిన వారిలో నైతకతను పెంచి సమాజానికి ప్రయోజనకారులుగా ఉంచుతాయి.

## లోపలి పేజీల్లో...


- దైవిక జీవన శైలిని అలవర్చుకొందాం! - 2
- సోషల్ మీడియాతో - 4
- ఈజీలైఫ్ - 8
- ఏది ముఖ్యం - 11
- ఇన్ఫీరియారిటీ-సుపీరియారిటీ - 12
- ఉత్తమమైనది - 15
- ఒత్తిడిని తట్టుకొనే వజ్రమే విశ్వాసి - 17
- కుటుంబ సమస్యల్లో విశ్వాస విద్యార్థులు - 20
- హృదయపు వాకిట - 25
- క్రాస్ వర్డ్ పజిల్ - 27
- స్వపరీక్ష అవసరం- 28
- విశ్వాసమును బట్టి - 29
- కోశాధికారి లేఖ - 31
- ఓటమి పాఠం- 32



# సోషల్ మీడియాతో జారిపోతావు.. జాగ్రత్త

2022 అబ్బాయిలు..చిరిగిన జీన్స్, చెదరిన జుట్టు, మాసిన గడ్డం, నలిగిన చొక్కా, వెరైటీ హెయిర్ కటింగ్, చెవికి పోగు, చెవిలో ఇయర్‌ఫోన్, ఒక చేతిలో స్మార్ట్ ఫోన్, మరో చేతిలో గర్ల్‌ఫ్రెండ్ చెయ్యి....

2022 అమ్మాయిలు...చిరిగిన జీన్స్, వదిలేసిన జుట్టు, బిగుతైన బట్టలు, చెవిలో ఇయర్‌ఫోన్, ఒక చేతిలో స్మార్ట్ ఫోన్, మరో చేతిలో బాయ్ ఫ్రెండ్ చెయ్యి...

కాలేజ్ క్యాంపస్‌లో అబ్బాయిలు, అమ్మాయిలు ఒకరినొకరు చూసుకొని సిగ్గుపడే రోజులనుండి, అమ్మాయిలు, అబ్బాయిలు ఒకరి భుజాల మీద ఒకరు చేతులేసుకొని తిరిగే సిగ్గులేని రోజుల వరకు మనం వచ్చాము. ఎంత చిరిగితే అంత ఫ్యాషన్, ఎంత ఒళ్ళు కనిపిస్తే అంత సెలబ్రిటీ, ఎంత వెరైటీగా జుట్టు ఉంటే అంత ట్రెండ్‌లా ఫీల్ అవుతున్న రోజులివి. బోల్డ్‌డ్రెస్‌లు, బోల్డ్ ఇంటర్వ్యూలు, బోల్డ్ డైలాగ్స్, ప్రాంక్ వీడియోలు, రియాల్టీ షోలు, వెబ్ సీరిస్‌లు, ఓటిటి ప్లాట్‌ఫామ్‌లు, ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎంజాయ్‌మెంట్స్, లవ్ ఎఫైర్స్, లివ్ ఇన్ రిలేషన్స్, డేరింగ్ డేటింగ్, పెళ్ళికి ముందే శారీరక సంబంధాలు, అబార్షన్‌లు, అత్యాచారాలు, అపవిత్రత, అశ్లీలత, పోర్నోగ్రఫీ, ఆత్మహత్యలు ఇలా చెప్పుకొంటూ పోతే.. ఈ తరపు యువతరాన్ని, విద్యార్థి లోకాన్ని పట్టిపీడిస్తున్న ట్రెండ్స్‌ని, విషయాలను మనం ఎన్నో అర్థం చేసుకోవచ్చు.

ఎందుకంటే నేషనల్ క్రైమ్ బ్యూరో రికార్డ్స్ చూస్తే మన వెన్నులో వణుకు పుడుతుంది. 2019 సం॥లో ప్రేమ పేరుతో 384 మంది చంపబడ్డారు. 10,355 మంది ఆత్మహత్య చేసుకొన్నారు. 2020 సం॥లో 32,033 మంది అమ్మాయిలు అత్యాచారాలకు గురయ్యారు . దాదాపుగా 53% అబ్బాయిలు, 74% అమ్మాయిలు 15-17 సం॥రాల వయస్సులోనే పెళ్ళికి

ముందే తమ కన్యత్వాన్ని కోల్పోతున్నారు. మన విద్యార్థి లోకం ఇంతగా దిగజారిపోయింది.

ఇంతగా దిగజారి ప్రవర్తించడానికి గల కారణాలలో ప్రధానమైనవి స్మార్ట్‌ఫోన్, సోషల్ మీడియా అనే సంగతి మనకు తెలిసిందే. ఎందుకంటే 2022 సం॥ ఇప్పటి వరకు 46 కోట్ల 70 లక్షల మంది సోషల్ మీడియా యాక్టివ్ యూజర్స్ మన దేశంలో ఉన్నారు. 'ఇంటర్నెట్ సిటీ' వచ్చినట్లు మనం వార్తలలో గమనిస్తూ ఉంటాము.

సోషల్ మీడియా తెచ్చిన లాభమెంతో తెలియదు గాని తెచ్చిన నష్టం తరగనంత. సమయాన్ని, సంపదని, సంతోషాన్ని, సంబంధాలను, సాంఘిక విలువలను అన్నింటిని పాడుచేసింది, ఇంకా ఎక్కువగా పాడు చేస్తూనే ఉంది.

'తప్పు' అంటే ఏమిటి? ఏది తప్పు కాదు. ఎవరి కి నచ్చినట్లు వారు ఉంటారు. ఎవరి జీవితం వారి ఇష్టం అని ప్రశ్నించేంతగా, ఏది తప్పు కాదు అని సమర్థించుకొనే పరిస్థితిల్లోకి వెళ్లిపోయారు. 'తప్పు' చెయ్యటం చాలా సాధారణమై, బరితెగించి బతకటం ఫ్యాషనైంది.

### మన సేవాపొలం ఈ-తరమే

అయితే, అ.కా. 13:36- "దావీదు దేవుని సంకల్పము చొప్పున తన తరము వారికి సేవ చేసి నిద్రించెను" అనే మాటను గమనించినప్పుడు మనం కూడా మన తరానికి, ఈ తరమునకే సేవ చేయుటకు పిలువబడ్డాము అనే సంగతిని అర్థంచేసుకొని, అంగీకరించాలి. ఛీ... ఛీ... ఈ కాలపు విద్యార్థులు ఇలా ఉన్నారేంటి, మా రోజులలో ఎలా ఉండేవారు అని అనుకోడానికి అవకాశమే లేదు. అలా ఆలోచించడం కూడా సరైనది కాదు. మన సేవా పొలం ఈ-తరమే, సోషల్‌మీడియా తరమే అన్నది అర్థం కావాలి.

మత్తయి 5:13-16 వచనాలు గమనిస్తే.. మీరు లోకమునకు ఉప్పయి ఉన్నారు. మీరు లోకమునకు వెలుగైయున్నారు. మనుష్యులు మీ సత్క్రియల ను చూచి.. తండ్రిని మహిమపరచునట్లు వారి యెదుట మీ వెలుగు ప్రకాశింపనియ్యుడి. ఈ వాక్యభాగాన్ని ఆలోచిస్తున్నప్పుడు, ఈ-తరానికి, సోషల్ మీడియా తరానికి విశ్వాసులైన మనం ఉప్పు, వెలుగై యున్నాము. అంతమాత్రమే కాదు మన సత్క్రియల ద్వారా మనం వెలుగును అందించాల్సిన బాధ్యతగలవారము కూడా.



మన సమయం, సంపద, సంతోషం దేని కోసం ఖర్చుపెడుతున్నామో అదే మన 'దేవుడు'. మనం రోజులో 5 నిమిషాలో, 10 నిమిషాలో దేవునికి ఇచ్చి, గంటలు తరబడి స్మార్ట్‌ఫోన్‌కి, సోషల్‌మీడియాకి ఇస్తున్నామంటే 'స్మార్ట్‌ఫోనే' మన దేవుడు. సోషల్‌మీడియానే మన 'ఆరాధ్య దైవం' కాదా?

''విద్యార్థిలోకం ఇంతగా దిగజారి ప్రవర్తిస్తున్న సమాజాన్ని చూస్తున్నప్పుడు ప్రశ్నించాల్సింది సమాజాన్ని కాదు, ప్రశ్నించాల్సింది ఉప్పును మరియు వెలుగును" అని అంటారు జాన్‌స్టాట్ గారు. కాబట్టి విలువలు ఏమాత్రం లేని సమాజాన్ని, తరాన్ని కాదు ప్రశ్నించాల్సింది. ఉప్పు, వెలుగు అని చెప్పుకుంటున్న మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. లోకం వైపు మన వేలు చూపించడం అలవాటు అయిపోయింది. మనవైపు వేలు చూపించుకోవటం మరచిపోయాము. కాబట్టి దయ ఉంచి మనవైపు మనం చూసుకొందాము, మన లోపలికి మనం తొంగి చూసుకొందాము. లోకం తీరు పక్కన పెట్టి మన తీరు ఎలా ఉందో అని ఆలోచిద్దాం.

## సమయాన్ని సద్వినియోగం చేసుకుందాం

మనవైపు మనం చూడగల్గితే... నిద్రలేవగానే మనం చేసే మొదటిపని, నిద్రపోవటానికి ముందు చేసే చివరి పని... మనలో చాలామందిమి "స్మార్ట్ ఫోన్"ను చూడటమే అని ఒప్పుకోక తప్పదు. మనం కొంచెము నిదానంగా మన గురించి మనము ఆలోచిస్తే మన సెల్ఫీస్, స్టేటస్‌లు, మనం చూసే సూపర్ లీగ్‌లు, రియాల్టీ షోలు, సోషల్ మీడియా అకౌంట్స్...ఇలా చెప్పుకుంటూపోతే బయటి వ్యక్తుల కంటే మనమేమీ తక్కువ కాదు, మనమేమీ తీసిపోలేదు అనే సంగతి తెలియజేస్తాయి.

ఈ మధ్యకాలంలో మన వాట్సాప్ స్టేటస్‌లలో గూడ్స్ రైలు బోగీల కంటె ఎక్కువగా మన స్టేటస్‌లో ఫోటోస్ మనం చూస్తున్నాము. వీటిల్లో పర్సనల్ ఫోటోస్, భార్యభర్తలు చాలా దగ్గరగా ఉన్న ఫోటోస్, విశ్వాస విద్యార్థులైతే సినిమాలలోని కొన్ని సీన్‌లు, సినిమా హీరోల డైలాగ్స్.. ఇంకా చెప్పుకోలేనంతగా వారి స్టేటస్‌లు మారుమోగుతున్నాయి. వీటిని పెట్టడానికి, అరగంటకోసారి ఎంతమంది చూశారని చూసుకోవడం కోసం ఎంతో సమయాన్ని వృథా చేస్తున్నాము. మనం ఒప్పుకోవాల్సిన మరో విషయం ఏమిటంటే మనలో చాలామంది జబర్దస్త్‌కి, బిగ్‌బాస్‌కి, ఐపియల్‌కి, సీరియల్స్‌కి, సినీతారలకు, రాజకీయ నాయకులకు అభిమానులుగా ఉన్నారు.

"దినములు చెడ్డవి గనుక, మీరు సమయమును పోనియ్యక సద్వినియోగం చేసుకొనుచు.. అజ్ఞానుల వలె కాక, జ్ఞానులవలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి" (ఎఫెసీ 5:15). జాగ్రత్త.. మన సమయం, సంపద, సంతోషం దేని కోసం ఖర్చుపెడుతున్నామో అదే మన 'దేవుడు'. మనం రోజులో 5 నిమిషాలో, 10 నిమిషాలో దేవునికి ఇచ్చి, గంటలు తరబడి స్మార్ట్‌ఫోన్‌కి, సోషల్‌మీడియాకి ఇస్తున్నామంటే 'స్మార్ట్ ఫోనే' మన దేవుడు. సోషల్‌మీడియానే మన 'ఆరాధ్య దైవం' కాదా? నెలలో దేవుని సేవకిచ్చే కానుక కంటే ఫోన్ కోసం వాడే డబ్బులు ఎక్కువైతే.. జాగ్రత్త. మౌనధ్యాన సమయం కంటే ఫోన్ దగ్గరే సంతోషం దొరకుతుంటే.. జాగ్రత్త. ఒక రోజంతా వాక్యం, ప్రార్థన లేకుండా హ్యాపీగా ఉండగల్గి ఫోన్ లేకుండా ఉండలేకపోతున్నావు అంటే.. జాగ్రత్త. సాతాను మనల్ని సులువుగా ఎలా ట్రాప్ చేస్తున్నాడో గమనించాలి. తాను నిలుచున్నానని తలంచుకొనువాడు పడకుండునట్లు జాగ్రత్తగా చూచుకొనవలెను (1 కొరింథీ 10:12).

సోషల్ మీడియా ఎక్కువగా పాపాన్ని, లైంగికతను, అనుకరణలను ప్రమోట్ చేస్తుంది. చాలాసార్లు మనము ఒకటి చూద్దాం అని ఫోన్‌ని పట్టుకొంటాము, కానీ ఏదో చూడకూడనివి చూసి, ఛీ.. చూడకుండ ఉంటే బాగుండు అని మదనపడిపోతుంటాము. కొన్నిసార్లు ఈ రోజులలో ఇది చాలా కామన్‌లే అని సర్దిచెప్పుకుంటాము.

## సోషల్ మీడియా తెచ్చే అనర్థాలు, అనారోగ్యాలు

### అనర్థాలు

తప్పుడు సమాచారం, తప్పుడు సంబంధాలు, అనవసరపు షాపింగ్, తప్పుడు ఆలోచనలు, సమయం, డబ్బు వృధా, పోర్నోగ్రఫీ, మోతాదుకు మించిన అశ్లీలత, అపరాధ భావన...

### అనారోగ్యాలు

ఒత్తిడి, ఉద్రేకం, దూకుడు స్వభావం, దాడి చేసే స్వభావం, ఓపిక లేకపోవడం, తలపోటు, ఎముకల దగ్గర జాయింట్స్ నొప్పి, జ్ఞాపక శక్తి కోల్పోవటం, రాత్రిళ్ళు మేల్కొనడం, నిద్ర లేమి, ఆత్మహత్యలకు ప్రేరేపించడం, షేర్ చేసి, లైక్‌ల కోసం, కామెంట్స్ కోసం ఆత్రుత పడటం, నిరుత్సాహపడటం... ఇలా చెప్పుకొంటూపోతే ఎన్నో అనారోగ్యాలకు, మానసిక సమస్యలకు సోషల్ మీడియా పెద్ద కారణంగా మారి పోయింది.

సోషల్ మీడియా మెల్లమెల్లగా ఆశ పుట్టిస్తుంది, కొద్దికాలానికి దురాశగా మారుతుంది, మరికొద్ది కాలానికి 'పాపం'గా మారుతుంది. తర్వాత పాపం పరిపక్వమై మరణానికి తీసుకెళుతుంది. ఏదైనా



ఆపరేషన్ చేస్తున్నప్పుడు మత్తుమందు ఇస్తే, ఎంతో గమ్మత్తుగా ఎంత గాయమైనా అర్థం కాదో.. అలానే సోషల్ మీడియా మత్తు ఇచ్చి గాయం చేస్తుంది. ఎర చూపించి, వలలో వేసుకొంటుంది. అందులో పడి నలిగిపోతూ, బయటపడే మనస్సు లేక, మార్గం లేక దేవునికి దూరం అయిపోతున్నాము. పరిశుద్ధుల మనే పేరే గాని పాపంతోనే కలిసి జీవిస్తున్నాము, పాపంలోనే సంతోషిస్తున్నాము. పరిశుద్ధ గ్రంథానికి అప్పగించుకోవాల్సిన జీవితాలను మొబైల్‌ఫోన్‌కి, సోషల్ మీడియాకి అప్పగించుకొన్నాము.

**సోషల్ మీడియాకి చిక్కకుండా ఉండాలంటే..**

1. నోటిఫికేషన్స్ సెట్‌అప్ మార్చుకోవాలి.
2. రాత్రి 10 గం॥ల తర్వాత ఫోన్ ముట్టుకోకుండా ఉండాలి.
3. చదువుతున్నప్పుడు (వాక్యం, పుస్తకాలు) ఫోన్ ముట్టుకోకుండ ఉండాలి.
4. ఆన్‌లైన్ గేమ్స్ మొబైల్‌లో లేకుండా చూసుకోవాలి.
5. అపోజిట్ జెండర్‌తో వాట్సాప్ చాటింగ్‌లు, మెసేజ్‌లు, ఫోటోలు షేర్ చేసుకోకుండా చూసుకోవాలి.సోషల్ మీడియాలో అమ్మాయిలతో/ అబ్బాయిలతో జాగ్రత్తగా ఉండాలి.
6. ఉపయోగంలేని, అవసరంలేని వాట్సాప్ గ్రూప్స్‌లో నుండి బయటకు రావాలి.
7. ఒంటరిగా ఉన్నప్పుడు సోషల్ మీడియా వైపు కన్నెత్తి కూడా చూడకుండా ఉండాలి.

యోసేపు జీవితాన్ని జ్ఞాపకం చేసుకొందాం. అవకాశాలు మెండుగా ఉన్నా పాపం చేయలేదు.

దాగి ఉన్న ఆశ + అందివచ్చిన అవకాశం = పాపానికి పునాది. కన్నుతో చూసింది ఆలోచనల్లోకి వెళ్తుంది. ఆలోచనల నుండి ఆశ పుడుతుంది. ఆశ దురాశగా మారుతుంది. దురాశ పాపమును కంటుంది. పాపం చివరికి 'మరణం'నకు దారి తీస్తుంది (యాకోబు 1:14-15). చూస్తే తప్పేముంది అనుకొంటాము కాని అక్కడనే ఆగలేము, చేసేంతవరకు వెళ్తాము. చివరికి చేస్తే తప్పేముంది అని ప్రశ్నిస్తాము. దేహమునకు దీపం కన్ను. కన్ను చెడిపోతే దేహమంతా చీకటి అవుతుంది (మత్తయి 6:22). వ్యభిచారానికి, జారత్వానికి మొదలు మోహపుచూపులే (మత్తయి 5:28).

**"దేవా, మరణానికైనా సిద్ధమే గానీ, సోషల్ మీడియా మురికిని అంటించుకోను" ఈ మాటను దేవునితో చెప్పగలమా?**



సోషల్ మీడియా బానిసత్వంలో బ్రతకడం కంటే దేవునికి, ఆయన వాక్యానికి అప్పగించుకోవటం క్షేమము...

**ముగింపు**

నేనే దేవుడను. మీరే నాకు సాక్షులు (యెషయా 43:12). సమస్త ప్రవర్తనయందు పరిశుద్ధులై ఉండుడి (1 పేతురు 1:16) అని దేవుని వాక్యం చెబుతుంది. విలువలు లేని ఈ-తరానికి, దిగజారి ప్రవర్తిస్తున్న సోషల్ మీడియాకు, దేవుడులేని విద్యార్థులకు మనమే సాక్షులము. సమస్త ప్రవర్తనలో పరిశుద్ధతను చూపించాల్సిన బాధ్యతగల విశ్వాసులం. ఈ-తరానికి మాదరికరమైన ఇయు విద్యార్థులం, గ్రాడ్యుయేట్‌లం. మనమంతా దేవుని పర్యవేక్షణలో ఉన్న వ్యక్తులం. దేవుడు మనకు ఇంద్రియ నిగ్రహము గల ఆత్మనే ఇచ్చెను (2 తిమోతి 1:7). కాబట్టి దేవుని మహాకృప ద్వారా సోషల్ మీడియా మీద జయాన్ని ప్రకటిద్దాం.

హెర్మిన్ అనే తెల్లని చిన్న జంతువు యొక్క తెల్లని జట్టు ఖరీదు ఎక్కువ. గొప్ప గొప్ప వారి దుస్తుల్లో దాన్ని ఉపయోగిస్తారు. అది చాలా వేగంగా పరుగెత్తగలదు. అందుకని వేటగాళ్ళు దాని పట్టుకోవటం కోసం దాని 'కలుగు' చుట్టు (నివాస స్థలం) పెంటను/మురికిని పూస్తారు. అది పెంటను చూసి లోపలికి వెళ్ళకుండా ఆగిపోతుంది. మరణానికైనా సిద్ధమే కాని మలినం కాను" అనే రీతిలో మురికి అంటించుకోవడానికి ఇష్టపడక వేటగాళ్ళ చేతిలో చచ్చిపోతుంది.

మనం ఈ మాటను దేవునితో చెప్పగలమా? "దేవా, మరణానికైనా సిద్ధమే గానీ, సోషల్ మీడియా మురికిని అంటించుకోను" అని. అలా చెప్పడానికి, జీవించడానికి దేవుడు మనకు సహాయం చేయును గాక!

– **యం. గాలెయ్య**, భీమవరం



# ఈజీ లైఫ్

## గురి లేకపోవడం

కిరణ్ అన్న ఆఫీస్‌కు వెళ్ళడానికి హడావిడిగా సిద్ధపడుతున్నాడు. ఇంతలో ఫోన్ రింగ్ అయితే ఎవరా! అని చూశాడు. ఇయు తమ్ముడు వినోద్. ఫోన్ లిఫ్ట్ చేసి 'హలో' అన్నాడు. అటునుండి సరైన రెస్పాన్స్ రాలేదు. 'హలో తమ్ముడు గుడ్ మార్నింగ్' అన్నాడు. ఎప్పుడూ చాలా హుషారుగా నవ్వుతూ మాట్లాడే తమ్ముడు ఏదో బాధగా, విచారంగా ఉన్నట్లు అన్నకి అర్థమయింది. 'ఏంటి తమ్ముడు, ఏం జరిగింది? ఎందుకు అలా ఉన్నావు, చెప్పు తమ్ముడు' అని అడిగాడు. 'ఒక్కసారి మిమ్మల్ని కల వాలన్నా' అని చాలా బాధగా అన్నాడు. 'ఇప్పుడు నేను ఆఫీస్‌కి వెళుతున్నాను తమ్ముడు. అర్జెంట్ అయితే ఆఫీస్‌కి రా లేదా సాయంత్రం ఇంటికి రా తమ్ముడు' అన్నాడు. 'నేను సాయంత్రం ఇంటికి వస్తానన్న' అన్నాడు. వినోద్ బి.టెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు.

సాయంత్రం కిరణ్ అన్న ఆఫీస్‌నుండి ఇంటికి రాగానే సౌమ్యా, మన ఇయు తమ్ముడు వినోద్ ఇంటికి వస్తానన్నాడు, ఇంకా రాలేదా అని అడిగాడు. ఇంతలో బయట గేటు తీసిన శబ్దం వినిపించింది. 'అరే మాటల్లోనే తమ్ముడు వచ్చినట్లున్నాడండీ' అని సౌమ్య అక్క బదులిచ్చింది. ఈ లోపు కాలింగ్ బెల్ మోగింది. కిరణ్ అన్న వెళ్ళి తలుపు తీశాడు. వినోద్ చాలా దు:ఖంలో ఉన్నాడు. 'లోపలికిరా తమ్ముడూ' అని సాదరంగా ఆహ్వానించాడు. ఆ గృహానికి రావడం తమ్ముడికి కొత్తేమీ కాదు. వాళ్ళది ఓపెన్ హోం కాబట్టి తమ్ముడు తరచుగా వస్తూ ఉండేవాడు. 'ఏంటి తమ్ముడు ఎప్పుడూ చాలా హుషారుగా ఉండేవాడివి. ఎందుకింత డీలా పడిపోయావ్' అని అడిగాడు అన్న. ఒక్కసారిగా లోపల ఉన్న దు:ఖం కట్టలు తెంచుకొని బయటకు వచ్చింది. 'తమ్ముడు ఏడవకు ఏం జరిగిందో చెప్పు' అని ఓదారుస్తూ అన్న అడిగాడు. అన్న మార్చి రిజల్ట్స్ వచ్చాయి, సెకండ్ ఇయర్ సెమిస్టర్‌లో నాలుగు సబ్జెక్ట్‌లు ఉన్నాయి. ఈ విషయం తెలిసి అమ్మా, నాన్నలు చాలా బాధపడుతూ, వాళ్ళలో వాళ్ళే కుమిలిపోతున్నారన్న. నా మీద చాలా ఆశలు పెట్టుకొని చదివిస్తూ, కష్టపడి నాకు డబ్బులు పంపిస్తున్నారు.

'నేను నా లైఫ్‌ని చాలా ఈజీగా తీసుకొన్నాను.

స్నేహితులతో, సెల్‌ఫోన్‌తో నా సమయాన్ని వృధా చేసుకొన్నాను. అనవసరమైన చాటింగ్స్‌తో గడిపాను. సెకండ్ ఇయర్ ఫస్ట్ సెమిస్టర్‌లో కూడా మూడు సబ్జెక్ట్స్ ఫెయిల్ అయ్యాను. ఓవర్ కాన్ఫిడెన్స్‌తో ఏ ముందిలే చివరిలో చదువుకోవచ్చు అనే నిర్లక్ష్యంతో సమయాన్నంత వృధా చేసుకున్నానన్నా. నా సీనియర్ అన్నవాళ్ళు కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామ్‌కి అటెండ్ అవ్వమంటే నేను బి.టెక్ చదువుతున్నాను. నాకు కెరీర్ గైడెన్స్ ఎందుకు అనే నిర్లక్ష్యంతో ఇంతదాకా తెచ్చుకున్నానన్నా. అన్‌బిలీవర్స్ అయిన నా స్నేహితులు మీ దేవుడు సహాయం చేస్తాడు, జ్ఞానాన్ని ఇస్తాడన్నావు గదా? మరి నీవెందుకు ఫెయిల్ అయ్యావు అని అడుగుతుంటే వారికి సమాధానం చెప్పలేకపోతున్నానన్నా. మీ అందరిముందు బాగా చదువుతున్నట్లు కనిపించాను కాని ఇదీ నా పరిస్థితి. ఇప్పుడు నా సాక్ష్యాన్ని పోగొట్టుకొన్నాను, అటు నా తల్లిదండ్రులకు, దేవుని నామానికి కూడా అవమానం తెచ్చానన్న. ఇప్పుడేం చెయ్యాలో అర్థం కావడం లేదని' తన బాధనంతా వెళ్ళగక్కాడు.

కిరణ్ అన్న ఓపికతో తాను చెప్పినదంతా విని, తమ్ముడూ బాధపడకు. ఫెయిల్యూర్ జీవితం యొక్క ముగింపు కాదు. అందుకే "ఫెయిల్యూర్స్ ఆర్ స్టెప్పింగ్ స్టోన్స్ టు అవర్ సక్సెస్" అంటారు. నీవు నాకు చెప్పినదంతా ప్రభువు దగ్గర చెప్పి క్షమాపణ అడుగు. ఇకనుండైనా ఒక మంచి తీర్మానం చేసుకో. 'ప్రభువా ఇకనుండి నీ నామ మహిమార్థమై నేను చదువుతానని. కొలస్సీ 3:23-24 ప్రకారం "మీరేమి చేసినను అది మనుష్యుల నిమిత్తముకాక ప్రభువు నిమిత్తమని మనస్ఫూర్తిగా చేయుడి...". ఇంకా నీకు రెండు సంవత్సరాల సమయముంది. ఈ రెండు సంవత్సరాల్లో నీ స్నేహితులలో చాలామంది రక్షణ సువార్త చెప్పవచ్చు మరియు చదువులో రాణించవచ్చు' అని కిరణ్ అన్న తమ్ముడికి గైడెన్స్ ఇవ్వడం మొదలుపెట్టాడు.

చేతులుకాలాక ఆకులు పట్టుకోవడం అంటే ఇదే గదూ! ఎక్కుమంది మన ఇయు విద్యార్థులు చేస్తున్న పని ఇదే. తమ జీవితాన్ని ఈజీగా తీసుకోవడం. ఒక గురి గమ్యం లేకుండా కాలేజ్‌లో కోర్స్‌ను బట్టి మూడు లేదా నాలుగు సంవత్సరాలు కొనసాగడం చివరికి పరీక్షల్లో ఫెయిలై ఇంట్లో తల్లిదండ్రులకు, దేవుని నామానికి అవమానం తీసుకొనిరావడం. అవసరమైతే దేవుని నిందించడం, తరువాత దేవునినుండి దూరమవ్వడం, చివరికి లోకంలో కలిసిపోవడం. ఒక దేవుని కుమారుడుగా/కుమార్తెగా చదువుల్లో రాణించకపోగా, దీనిని ఒక సాకుగా చూపించి ఆత్మీయంగా కూడా పతనమవ్వడమా? ఈ సమస్యలకి కారణం ఎవరు? ప్రియ తమ్ముడు, చెల్లి దీనిని చదువుతున్న నీవు ఒక్కసారి సీరియస్‌గా ఆలోచించాలని కోరుతున్నాను.

దేవునికి మన జీవితం పట్ల ఒక ఉద్దేశం ఉంది. యిర్మీయా 29:11 ప్రకారం "నేను మిమ్మును గూర్చి ఉద్దేశించిన సంగతులు నేనెరుగుదును... ". ఎప్పుడైనా ఆయన యొక్క ఉద్దేశాలు తెలుసుకోవడానికి ప్రయత్నించామా? ప్రభువా, ఎందుకు నన్ను విద్యార్థిగా ఈ కళాశాలలో వుంచావు? అని అడిగి ఆయన చిత్తాన్ని తెలుసుకొంటే, వినోద్‌లా జీవితాన్ని ఈజీగా తీసుకోము. వినోద్‌లా ఫెయిల్ అవ్వకుండా ఉండాలంటే కొన్ని విషయాల్ని మీ దృష్టికి తీసుకురావాలని ఆశిస్తున్నాను.

### 1. గురి ఉండడం

తెగిన గాలిపటం, గురి లేని జీవితం రెండూ ఒకటే. తెగిన గాలిపటం గాలి బలంగా ఎటు వీస్తే అటు ఎగురుతుంది. ఎగిరినట్లే కనబడుతుంది కానీ అది ఏదో ఒకచోట పడిపోతుంది. గురి లేని జీవితం కూడా అంతే. గురి అంటే పందెంలో చేరుకోవాల్సిన స్థలం. ముందుగా నిర్ణయించుకొనే గమ్యం. మార్కు 10:45 ప్రకారం "మనుష్యకుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని పరిచారము చేయుటకును, అనేకులకు ప్రతిగా విమోచన క్రయధనముగా తన ప్రాణమిచ్చుటకును వచ్చెను". యేసయ్య కూడా ఈ లోకానికి రావడానికి ఒక లక్ష్యం ఉంది. 1 కొరింథీ 9:26-27లో పౌలు గారు "నేను గురి చూడని వానివలె పరుగెత్తువాడను కాను, గాలిని కొట్టినట్లు నేను మాట్లాడుట లేదు" అని అంటున్నాడు. ఇలా బైబిల్‌లోనుండి ఎన్నో ఉదాహరణలు మనం చూడవచ్చు. విశ్వాస విద్యార్థిగా నీకంటూ ఒక గురి/లక్ష్యం ఉందా? నీవు ఏ కోర్స్‌ను చదువుతున్నా ఇప్పుడే ఒక గురి/లక్ష్యం పెట్టుకో. నేను ఖచ్చితంగా కాలేజ్ నుండి బెస్ట్ ర్యాంక్‌తో బయటకు రావాలి. ఎంతోమందికి, నా స్నేహితులకి, క్లాస్‌మేట్స్‌కి యేసయ్యను పరిచయం చెయ్యాలి. నా స్టడీస్‌ని,

పరిచర్యని రెండింటిని బ్యాలెన్స్ చేసుకోవాలి అని గోల్ సెట్ చేసుకోగలవా!

### 2. ప్రణాళిక

ఒకవేళ నీవు ప్రణాళిక వేసుకోవడానికి విఫలం అవుతున్నావంటే, నీవు విఫలం అవ్వడానికి ప్రణాళిక వేసుకుంటున్నావు అని అర్థం. ప్రణాళిక వేసుకోవడం అనేది దేవుని పద్ధతి. లూకా 14:28-30 ప్రకారం "మీలో ఎవడైనను ఒక గోపురము కట్టింపగోరి న యెడల దానిని కొనసాగించుటకు కావలసినది తనయొద్ద ఉన్నదో లేదో అని కూర్చుండి తగులబడి మొదట లెక్క చూచుకొనడా...." ఒకవేళ దానిని కొనసాగించలేకపోతే మనుష్యులు అతనిని చూసి ఎగతాళి చేస్తారు. కాబట్టి నీ సమయాన్ని ప్లాన్ చేసుకోవాలి, నీ పనుల గురించి ఆలోచించాలి. నీ బుక్స్ గురించి, మెటీరియల్ గురించి, నీ మౌనధ్యానం, నీ పర్సనల్ ప్రేయర్... వీటన్నింటి గురించి ప్లాన్ చేసుకోవాలి.

### 3. పని

చాలాసార్లు పై రెండు చేసుకోగలుగుతాము కానీ, పని చేసే దగ్గరకు వచ్చేసరికి విఫలమవుతాం. ఫిలిప్పీ 3:14 ప్రకారం "క్రీస్తుయేసునందు దేవుని ఉన్నతమైన పిలుపునకు కలుగు బహుమానమును పొందవలె నని గురియొద్దకే పరుగెత్తుచున్నాను". పౌలు గారికి గురి ఉంది. ప్రణాళిక వుంది. అంతేకాదు క్రియలు ఉన్నాయి. కాబట్టి మూడు మిషనరీ ప్రయాణాలు చెయ్యగలిగాడు. కొన్ని సంఘాలను స్థాపించగలిగాడు. ఎంతోమంది అన్యజనులకు సువార్త ప్రకటించగలిగాడు. సాధించాలంటే పట్టుదల, సంకల్పం వుండాలి. దేవుని మీద ఆధారపడి ఆయన సహాయంతో ముందుకువెళ్ళాలి. మన సొంత శక్తితో ఏదీ సాధించలేము. మన పనికి దేవుని నడిపింపు, సహాయం తోడైతే అద్భుతాన్ని చూడగలుగుతాము. ఒక విశ్వాస విద్యార్థిగా చదువుల్లో రాణించే విషయంలో, సువార్తను ప్రకటించే విషయంలో శక్తివంచన లేకుండా కష్టపడాలి. ప్రసంగి 9:10 ప్రకారం "చేయుటకు నీ చేతికి వచ్చిన యే పనియైనను నీ శక్తి లోపము లేకుండా చేయుము". యేసయ్య ఏ లక్ష్యంతోనైతే ఈ లోకంలోనికి వచ్చాడో ఆ పనిని ఎన్ని అవాంతరాలు వచ్చినా సంపూర్ణంగా ముగించాడు. యోహాను 19:30 "యేసు ఆ చిరక పుచ్చుకొని సమాప్తమైనదని చెప్పి తలవంచి ఆత్మను అప్పగించెను..

### గురి లేకపోవడం వలన వచ్చే నష్టాలు

1. మనం ఎటువైపు పయనిస్తున్నామో మనకు తెలియదు.
2. మనం ప్లాన్ గురించి, యాక్షన్ గురించి ఆలోచించం.
3. పనిని వాయిదా వేస్తాం.
4. ఎందుకు చదువుతున్నామో తెలీదు.
5. కొన్నిసార్లు స్వార్థంగా ఉండి చదువుకి అధిక సమయమిస్తూ, దేవునిని ఆయన సన్నిధిని అశ్రద్ధ చేస్తాం. తద్వారా పాపంలో పడిపోయే ప్రమాదముంది. కొన్నిసార్లు ప్రార్థనలు అని చెప్పి స్టడీస్‌ని పట్టించుకోము. కాబట్టి ఫెయిల్ అవుతాము.
6. అశ్రద్ధ, బద్ధకం, సోమరితనం పెరిగిపోతాయి. సోమరికి దోపిడిగాడు వచ్చినట్లు దారిద్ర్యం వస్తుంది. వాని యొద్దకు లేమి వస్తుంది (సామె 6:11)
7. దర్శనం లేకపోతే కళాశాలలో సువార్తను ప్రకటించలేము.
8. తల్లిదండ్రులకు చెడ్డపేరు తీసుకొస్తాము.
9. మన తరువాత తరానికి కళాశాలలో ఒక బ్యాడ్ మోడల్‌గా మిగిలిపోతాం.
10. దేవుని నామానికి అవమానాన్ని తెస్తాం. స్టడీస్‌లో మన సాక్ష్యాన్ని కోల్పోతాం.
11. మన మీద ఎన్నో ఆశలు పెట్టుకొన్న గ్రాడ్యుయేట్ అన్నవాళ్ళకి, అక్క వాళ్ళకి నిరాశను మిగులుస్తాం.

### కొన్ని సలహాలు

1. చదువుని, పరిచర్యను చాలా జాగ్రత్తగా బ్యాలెన్స్ చేసుకోవాలి.
2. మన సమయాన్ని వృధా చేసే కొన్ని పనులకి, స్నేహితులకు 'నో' అని చెప్పగలగాలి.
3. మొదటి ప్రాముఖ్యత దేవునికి ఇవ్వాలి. కళాశాలలో పాపంలో పడిపోకుండా ఉండాలంటే, సాక్ష్యాన్ని కాపాడుకోవాలంటే చదువులో విజయాన్ని సాధించాలంటే ప్రభువు చిత్తానికి లోబడి

ఆయన మీద ఆధారపడటం నేర్చుకోవాలి (దాని 1:17,20).

4. శ్రద్ధతో కష్టపడి పనిచేస్తే, చదివితే దేవుడు ఆశీర్వదిస్తాడు (సామె 10:4-5, 12:24).
5. నీ స్మార్ట్‌ఫోన్ నీ అధీనంలో ఉండాలి. దాని అధీనంలోకి నీవు వెళితే, దానికి ఎడిక్ట్ అయిపోతావు జాగ్రత్త. అది చాలు నీ జీవితం నాశనమైపోవడానికి.
6. మళ్ళీ నీవు కళాశాలలో చదివే అవకాశం రాకపోవచ్చు. కాబట్టి వచ్చిన అవకాశాన్ని పాడుచేసుకోవద్దు. చదువుల్లో మంచి సాక్ష్యాన్ని లేవనెత్తు. యేసయ్య బిడ్డగా సాక్షిగా ఉండు.
7. కొత్త విషయాన్ని నేర్చుకోవడానికి ఇష్టపడు. ఏదైనా సందిగ్దంలో ఉంటే అన్నవాళ్ళ అక్కవాళ్ళ సలహాలు తీసుకో.

### ముగింపు

మొదట మనం చూసినట్లు వినోద్ ఫెయిల్ అవ్వడానికి కారణాలు మనకు అర్థమైనవి కదా. తన జీవితాన్ని చాలా చులకనగా తీసుకొన్నాడు. ఒక లక్ష్యం/గురి లేదు. ప్రణాళిక మరియు యాక్షన్ ఏమీ లేవు. తన ఇష్టం వచ్చినట్లు సంవత్సరాన్ని వృథా చేసుకొన్నాడు. ప్రియ తమ్ముడూ, చెల్లీ తనలో ఒక మంచి గుణం ఏంటో తెలుసా? రియలైజ్ అయ్యి పశ్చాత్తాపపడడం. దేవుని దగ్గర, గ్రాడ్యుయేట్స్ అన్న దగ్గరికి వచ్చి ఓపెన్‌గా అన్నీ ఒప్పుకోవడం. ఒకవేళ నీవు ఏ స్థితిలో ఉన్నావో నాకు తెలియదు. దేవుని పేరు చెప్పి నీ స్టడీస్‌ని అశ్రద్ధ చేస్తూ దేవుని నామానికి అవమానం తెస్తుంటే ఒక్కసారి ఆలోచించు. ఒకవేళ ఇప్పటివరకు నీకంటూ ఒక గురి /లక్ష్యం, ప్రణాళిక, యాక్షన్ లేకపోతే ప్రభువు సన్నిధిలో ఒక నిర్ణయం చేసుకోవడం మంచిది. ఇక నుండి నీవు ప్రభువు నామ మహిమార్థమై చదవాలి.

1కొరింథీ 9:24 ప్రకారం, "పందెపు రంగమందు పరుగెత్తువారందరు పరుగెత్తుదురు గాని యొక్కడే బహుమానం పొందునని మీకు తెలియదా? అటువలె మీరు బహుమానం పొందునట్లు పరుగెత్తుడి".

కాబట్టి జీవితాన్ని ఈజీగా తీసుకోకుండా, గురి గల్గి బహుమానం పొందే విధంగా ప్రభువు మహిమార్థమై పరిగెత్తగలవా? నిర్ణయం నీదే!

– డా. యం. సాల్మన్‌రాజు, వైజాగ్

కవిత

## ఏది ముఖ్యం?



ఓ విద్యార్థీ ఆలోచించు!
లోకంతో సంబంధం ముఖ్యమా?
దేవునితో బంధం ముఖ్యమా?

సౌందర్యం ముఖ్యమా?
ఆత్మ సౌందర్యం ముఖ్యమా?

నీ చిత్తం ముఖ్యమా?
దేవుని చిత్తం ముఖ్యమా?

సంపాదనకై ఆరాటం ముఖ్యమా?
ఆత్మల సంపాదనకై ఆరాటం ముఖ్యమా?

లోకజ్ఞానం ముఖ్యమా?
దేవుని జ్ఞానం ముఖ్యమా?

ఫోన్‌తో సమయం గడపడం ముఖ్యమా?

దేవునితో సమయం గడపడం ముఖ్యమా?

నీకు ముఖ్యమైనది ఏంటి?
తెలుసుకో..పాటించు

– రూప, సాలూరు ఇయు




# ఇన్ఫీరియారిటీ సుపీరియారిటీ

రాజేష్ చదువుల్లో మంచిగా రాణిస్తాడు, అనేక నైపుణ్యాలు ఉన్నాయి. కానీ ఎందుకో ఈ మధ్య ఎవ్వరితోనూ సరిగా మాట్లాడకుండా ఒంటరిగా ఉంటూ తనలో తాను బాధపడుతున్నాడు. తాను నల్లగా ఉంటానని, ఎత్తు తక్కువని, కుటుంబ నేపథ్యం సరిగా లేదని, అందరిలో కలవలేకపోతున్నాని.. ఇలా అనేక విషయాల్లో తోటివారితో పోల్చుకొని ఆత్మన్యూనతా భావంతో కుమిలిపోతున్నాడు.

రజనీ అందమైన, తెలివి కలిగిన అమ్మాయి. ఏ విషయాన్ని అయినా ఇట్టే త్వరగా నేర్చేసుకుంటుంది. అందరిలో గలగలా మాట్లాడుతుంది. ఆమె ఎక్కడ ఉంటే అక్కడ అందరి దృష్టి ఆమె మీదే ఉంటుంది. ఆమె స్నేహితులు ఆమె గురించి పొగుడుతూ ఉంటే ప్రారంభంలో అంతగా పట్టించుకోకపోయినా, రానురాను నేను అందరికంటే గొప్ప అనే భావన నరనరాన జీర్ణించుకుపోయి, అలానే ప్రవర్తించసాగింది.

మన తోటి విద్యార్థుల్లో ఇలా ఆత్మన్యూనతా భావంతో బాధపడేవారు, నేను గొప్ప అనే భావనతో ఉన్నవారిని తరచుగా గమనిస్తూనే ఉంటాం. ఈ రెండురకాల భావనలు సరైనవేనా? వీటివలన వచ్చే ప్రమాదాలు ఏమిటి? ఇలాంటి భావనల నుంచి బయటపడడం ఎలా? అనే విషయాలను ఈ వ్యాసంలో చూద్దాం.

### ఆత్మన్యూనతా భావం (ఇన్ఫీరియారిటీ)?

ఆత్మగౌరవాన్ని తక్కువగా అంచనా వేసుకొనే స్థితి, నీచత్వం, హీనత, నేనే తక్కువలాంటి భావాలు కలిగి ఉండటం.

### ఆధిక్యతా భావం (సుపీరియారిటీ)?

గొప్పతనం, ఆధిక్యవైఖరి, నేనే ఎక్కువ అనే భావాలు కలిగివుండటం.

### ఇన్ఫీరియారిటీ లక్షణాలు

ఇన్ఫీరియారిటీతో ఉన్న విద్యార్థులు భయం, బిడియం, ఆత్మస్థైర్యం లేకపోవడం, ఫ్రీగా మాట్లాడ లేకపోవడం, సరిగ్గా కమ్యూనికేట్ చేయలేకపోవడం, తమను తాము తక్కువగా అంచనా వేసుకోవడం లాంటి ఫీలింగ్స్‌ను కలిగి ఉంటారు.

నేను అందరిలా చదవలేను, నేను అందరి కంటే చాలా తక్కువ, నాకు జ్ఞానం లేదు, నేను పల్లెటూరునుండి వచ్చాను. నా భాష బాగుండదు. నా ఫిజికల్ అప్పీరియన్స్ బాగుండదు. నేను నల్లగా ఉంటాను, పొట్టిగా ఉంటాను. అందంగా లేను

కాబట్టి నేను అందరిలోకి వెళ్తే తక్కువగా చూస్తారేమో అనే భావనలు కలిగి తమను తాము తక్కువగా ఎంచుకొంటూ ఉంటారు.

## ఇన్ఫీరియారిటీ నష్టాలు

పదేపదే తిరస్కారానికి గురవ్వడం, నేను పనికిరాను, నాకు చేతకాదు, నేను అసమర్థుడుని, నన్ను ఎవరూ ఇష్టపడరు, నాకు అందంలేదు, తెలివి లేదని...భావిస్తున్నప్పుడు నీ జీవితానికి అర్థం, విలువ లేదని అనుకొంటావు. కొన్నిసార్లు ఈ ఆలోచనలు తీవ్రతరమై ఆత్మహత్యకు ప్రేరేపిస్తాయి.

ఈ భావంతో ఉన్నవారు సామర్థ్యం కలిగి ఉన్నా కార్య సాధనకు ముందుకు పోలేకపోతారు. తమ జీవితాన్ని నిరాశ, నిస్పృహతో గడుపుతూ ఉంటారు. వీరు సున్నితమైన ఆలోచనలు/భావాలు కలిగి తమ చుట్టూ ఒక గిరి గీసుకొని ఏకాంతంలో ఉంటూ, తమను ఇతరులు గుర్తించాలి అని కోరుకొంటారు.

## దేవునివాక్యం ఏమి చెబుతుంది?

ఈ లోకంలోని ప్రతి వ్యక్తి దేవునిపోలికలో సృష్టించబడ్డారు (ఆది 1:27). నీవు దేవుని దృష్టిలో ప్రత్యేకమైన వ్యక్తివి. దేవుడు తన ప్రత్యేకమైన ఉద్దేశం నీలో నెరవేరడం కోసం నీ వ్యక్తిత్వాన్ని రూపొందించి నీకు వరాలను, సామర్థ్యాలను ఇచ్చాడు. గనుక నిన్ను నీవు అంగీకరించు. దేవుడు నీకిచ్చిన జీవితాన్ని బట్టి, గొప్ప రక్షణను బట్టి స్తుతించు. నీ అంతరంగంలోని విమర్శనాత్మక ధోరణిని ప్రక్కన పెట్టి బైబిల్ ఆధారంగా నిన్ను నీవు ప్రోత్సహించుకోవడం అలవర్చుకో. నీ జీవితం పట్ల దేవుని ఉద్దేశాన్ని తెలు సుకొని దాని కొరకు ప్రయాసపడు.

నీ స్వవిలువ మనుష్యుల, నీ అభిప్రాయాలపై ఆధారపడి ఉండదు. "మనుష్యులు పై రూపాన్ని లక్ష్యపెడతారు కానీ యెహోవా హృదయాన్ని ల క్ష్యపెడతాడని గుర్తెరిగి (1 సమూ 16:7) నీ హృదయాన్ని దేవుని కొరకు ప్రతిష్టించుకో.

ఈ విషయాల్ని మర్చిపోతే దేవునిని మనం హృదయపూర్వకంగా ఆరాధించలేము. దేవుని కోసం చదవలేము, దేవుడు మనలను నమ్మి అప్పగించిన పని చేయలేము. ఆయన సాక్షిగా జీవించలేము.

మనం భయపడాల్సింది, సిగ్గుపడాల్సింది పాపం విషయంల్లోనే కానీ మిగిలిన అన్ని విషయాలలో సింహంవలె ధైర్యంగా ఉండాలి. దేవుని కోసం బతకాలి, వెలగాలి.

న్యాయాధిపతులు 6:12లో యెహోవా దూత గిద్యోనుతో పరాక్రమము గల బలాఢ్యుడా అని పిలిచి మాట్లాడుతుంటే 6:15లో "చిత్తము నా యేలినవాడా, దేని సహాయముచేత నేను ఇశ్రాయేలీయులను రక్షింపగలను. నా కుటుంబము మనష్షే గోత్రములో ఎన్నికలేనిదే. నా పితరుల కుటుంబములో నేను కనిష్ఠుడనైయున్నానని ఆయనతో చెప్పెను. పైవన్నీ నిజమే అయినా దేవుడు గిద్యోనును ఏర్పరచుకొని తన చిత్తానుసారంగా వాడుకొన్నాడు (1 కొరింథీ 1:26-29).

## మన సమస్య-దేవుని జవాబు

1. ఆయా సమయాల్లో అయోగ్యుడిగా, భయంగా, అభద్రతగా ఫీలవుతున్నావా? మోషే కూడా ఇలానే ఫీలయ్యాడు. అప్పుడు దేవుడు "మానవులకు నోరిచ్చినవాడు ఎవరు? మూగవానినే గాని చెవిటివానినే గాని దృష్టిగలవానినే గాని గుడ్డివానినే గాని పుట్టించినవాడెవడు? యెహోవానైన నేనే గదా. కాబట్టి వెళ్ళుము, నేను నీ నోటికి తోడైయుండి, నీవు ఏమి పల కవలసినది నీకు బోధించెదను" అని చెప్పాడు (నిర్గమ 4:11-12).
2. నేను సరిగా చెయ్యలేను అని నీవంటే - నా శక్తిని నీకిస్తాను అని అంటాడు (ఫిలిప్పీ 4:13)
3. నేను బలహీనుణ్ణి అని నీవంటే - నీ బలహీనతలో నా శక్తి పరిపూర్ణమవుతుంది అని అంటాడు (2 కొరింథీ 12:9)
4. నా వల్లకాదు అని నీవంటే - నాపై ఆనుకో, నేను సమర్థుడను అని అంటాడు (2 కొరింథీ 9:8)
5. నన్ను ఎవరూ ప్రేమించలేదు అని నీవంటే - నేను నిన్ను ప్రేమిస్తున్నాను అని అంటాడు (యిర్మీయా 31:3)
6. నేను జన్మించకపోతే బాగుండేది అని నీవంటే - నీవు పుట్టకముందే నీపట్ల ప్రణాళిక కలిగి ఉన్నాను అని అంటాడు (యిర్మీయా 1:5)
7. నా భవిష్యత్‌పై నాకెలాంటి ఆశలేదు అని నీవంటే - నీ భవిష్యత్ ఎలా ఉండబోతుందో నాకు తెలుసు అని అంటాడు (యిర్మీయా 29:11)

## సుపీరియారిటీ లక్షణాలు

సుపీరియారిటీ ఉన్నవారు అంతా నాకే తెలుసు

అన్నట్లు ప్రవర్తిస్తారు. కమిటీ మీటింగ్స్‌లో తోటి స్టూడెంట్స్, గ్రాడ్యుయేట్స్ దగ్గర నేను చెప్పిందే జరగాలనుకొంటారు. నేను బాగా చదువుతాను, క్రైస్తవేతర కుటుంబంనుండి వచ్చాననే భావన, నేను టెక్నికల్ స్టూడెంట్‌ని, పెద్ద జాబ్ అని, నేను ఏ విషయంలో తక్కువ కాదు కాబట్టి అందరూ నా మాటే వినాలి అనే భావనలు వేళ్ళూనికొని అందరి మాటలు పెడచెవినబెట్టి మిగిలిన వారిని తక్కువగా చూడటం, చులకనగా మాట్లాడటం, ఇది కూడా తెలియదా" అనే మాటలు మాట్లాడుతుంటారు. నాకు మంచి వాక్చాతుర్యం ఉంది. నేను ప్రసంగం చేసినా, బైబిల్ స్టడీ తీసుకొన్నా తిరుగులేదు అనుకొంటారు. కొన్నిసార్లు ఎక్కువగా కోపపడుతుంటారు. ప్రాంతాన్ని బట్టి, సంఘాన్ని బట్టి, ఆర్థిక స్తోమతను బట్టి అతిశయిస్తూ మిగిలిన వారిని తక్కువగా చూస్తూ నేను, నేనే అని అహంభావాన్ని కలిగి బతుకుని కొనసాగిస్తారు. మినిస్ట్రీ విషయంలో కూడా నేను పని చేశాను కాబట్టి ఈ రోజు ఇక్కడ పరిచర్య జరుగుతుంది. ఫలానా పని చేయడానికి నేనే అర్హత గలవాడిని. ఈ పరిచర్య అంతటికి కారణం నేను. నేను ప్రార్థన చేసి ప్రయాసపడ్డాను కాబట్టి వారు ఈ స్థాయిలో ఉన్నారు. ఈ రోజు ఫలాలు చూడగల్గుతున్నామని అంటుంటారు.

## సుపీరియారిటీ నష్టాలు

1. నేను, నా తర్వాతే అనే భావన వల్ల తోటివారితో సంబంధాల్లో సమస్యలు ఏర్పడతాయి.
2. వారి ఆత్మీయ జీవితంలో నేర్చుకోవడం తగ్గిపోతుంది.
3. వారి జీవనశైలి పరిచర్య ఎదుగుదలకు ఆటంకంగా ఉంటుంది.

## దేవుని వాక్యం ఏమి చెబుతుంది?

ఇలాంటి భావాలు కల్గిన వ్యక్తులు దేవుని వాక్యంలో కొంతమంది కనిపిస్తారు. వారిలో నెబుకద్నెజరు రాజు ఒకడు. "బబులోనను ఈ మహా విశాల పట్టణము నా బలాధికారమును నా ప్రభావ ఘనతను కనపరచుటకై నా రాజధాని నగరముగా నేను కట్టించినది కాదా అని తనలో తాను అనుకొనెను" (దానియేలు 4:30). 'నేను, నా' అని తనలో తాను అహంకారం కలిగి ఉన్నాడు. సాతాను కూడా తన మనస్సులో ఇలానే గర్వించాడు (యెషయా 14:13-15). ఇతనిలో సాతాను పోలిక అక్షరాలా కనిపిస్తుంది. ఫలితంగా సాతానుడు పరలోకంనుంచి పాతాళానికి పడదోయబడితే, నెబుకద్నెజరు రాజు అడవికి పోయి గడ్డి మేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

నేనే, నా ద్వారానే అనే పదాలు క్రైస్తవ్యంలో రాకూడదు. దీనులుగా ఉండాలని క్రీస్తుబోధలు మనకు నేర్పిస్తాయి. నాశనమునకు ముందు గర్వము నడచును, పడిపోవుటకు ముందు అహంకారమైన మనస్సు నడుచును (సామె 16:18). అహంకారం వెంబడి అవమానము వచ్చును (సామె 11:2).

క్రీస్తు యేసునకు కలిగిన ఈ మనస్సు మీరును కలిగియుండుడి అని దేవుని వాక్యం చెబుతుంది (ఫిలిప్పీ 2:6). ఇయు, ఇజియఫ్ సభ్యులముగా ఈ విషయం మనం ఎప్పుడూ గుర్తుంచుకోవాలి. మనకున్నవాటిని బట్టి గర్వించకుండా, ఆధిక్యత ప్రదర్శించకుండా ఇవి దేవుడే మనకిచ్చాడని ఆయనను ఘనపరచాలి. మన సామర్థ్యాలను, తలాంతులను, జ్ఞానాన్ని, చదువు, జాబ్‌ని బట్టి దేవుడు మనలను వాడుకోవడం లేదు. ఇవన్నీ దేవుడే తన కృపను బట్టి పరిచర్య కోసం మనకిచ్చాడు. ఆ పని మనలను నమ్మి మనకు ఇవ్వడమే ఆధిక్యతగా భావించాలి. నేను, నా అనే అహంకారం మనలో చావనంతకాలం మనం క్రీస్తులాగా క్రీస్తు కోసం బతకలేము, ఫలించలేము. "గొప్పలకు పోతే తిప్పలు తప్పవు" అనే నానుడి లోకంలో కూడా ఉంది. ఆత్మీయ అహంకారానికి, అహంభావానికి పరిసయ్యుని ప్రార్థన (లూకా 18:11) కూడా ఒక చక్కని ఉదాహరణ.

## ముగింపు

అధికృతాభావం, ఆత్మస్థైర్యం రెండూ వేరు వేరు స్వభావాలు కల్గినవి. ఈ రెండింటికి మధ్య సన్నని గీత ఉంటుంది. దీనిని మన జీవితంలో గమనించకపోతే 'సుపీరియారిటీ'అనే పాపంలో పడిపోయే ప్రమాదం ఉంది. తనను తాను తగ్గించుకొనువాడు హెచ్చింపబడును అనే వాక్యానికి ఆత్మన్యూనతకు మధ్య కూడా సన్నని గీత ఉంది. దీనిని కూడా గమనించకపోతే ఆత్మన్యూనత అనే పాపంలో పడిపోతాం. కాబట్టి మనం సుపీరియారిటీ, ఇన్ఫీరియారిటీ అనే రెండు భావనలను అధిగమించి సిన్సియారిటీతో పనిచేయాలని దేవుడు కోరుకొంటున్నాడు.

– కె. మార్త కొండలరావు, బొల్లాపల్లి



# ఉత్తమమైనది

## ఆయనతో సన్నిహిత సహవాసమే

ఒకరోజు సాయంత్రం రాజు బాగా అలసిపోయి ఇంటికి వచ్చాడు. ఎక్కడనుండి వచ్చావు అని ఇంట్లో వాళ్ళు అడిగితే.. ఇప్పుడే కమిటీ మీటింగ్ అయ్యింది. రేపు బిలీవర్స్ రిట్రీట్ ఉంది అని చెప్పాడు రాజు. స్టడీస్ మీద దృష్టిపెట్టక.. మ్యాథ్స్ ఎగ్జామ్ రోజు చదవకుండా వెళ్ళడం వలన డిగ్రీ ఫైనల్ ఇయర్‌లో మ్యాథ్స్ ఎగ్జామ్ ఫెయిల్ అయ్యాడు. ప్రతిరోజు ఉదయం క్వైట్‌టైమ్ కూడా అంతంత మాత్రంగానే ఉంటుంది. ఈవిధంగా కొంతమంది విద్యార్థులు పరిచర్యలో బిజీగా ఉంటూ చదువును, వ్యక్తిగత, ఆత్మీయ జీవితాన్ని అలక్ష్యం చేస్తున్నారు. మరి కొంతమంది విశ్వాస విద్యార్థులు చదువు పేరుతో దేవునిలో ఎదిగే విషయంలో, దేవుని పనిని గూర్చిన ఆసక్తిని కించిత్తు కూడా కనపరచక ఉంటున్నారు. అలా అని వారికి సమయం లేకనా అంటేకాదు. ఎక్కువ సమయం సెల్‌ఫోన్‌తో గడుపుతున్నారు. అందువలన చదువుకూ, ఆత్మీయమైన విషయాలకు సరైన ప్రాధాన్యత ఇవ్వడం లేదు. సమతుల్యత లోపిస్తుంది.

### మార్తా మరియల జీవితం

లూకా 10:38-42లో మార్త, మరియల వృత్తాంతం నుంచి నాలుగు విషయాలు నేర్చుకొంటాము.

1. వారి **ప్రాధాన్యతలో** తేడా ఉంది: మార్త ఆయనను ఇంట చేర్చుకొని, ఆయనకు పరిచర్య చేయడానికి, అనేకమైన పనులకు ప్రాధాన్యత నిచ్చింది. మరియ అయితే ప్రభువు పాదాల వద్ద కూర్చొని నేర్చుకోవడమే ప్రాధాన్యతగా భావించింది. మన ప్రాధాన్యతలు మన జీవితాన్ని నడిపిస్తూ, గమ్యాన్ని నిర్ధేశిస్తాయి.
2. వారి **సహవాసంలో** తేడా ఉంది: మార్త అనేకమైన పనుల ఒత్తిడి వల్ల ఒకే ఇంట్లో ఉన్నా మనసు యేసుకు దూరంగా ఉంది. కొన్నిసార్లు మంచిపనులు మన ఆత్మీయ జీవితానికి, దేవునితో సన్నిహిత సహవాసం అనుభవించలేకపోవడానికి కారణమవుతాయి. మరియ అయితే సమీపంగా యేసు పాదాల వద్ద కూర్చుని ఆయన బోధ వింటూ ఉంది.
3. వారి **భావోద్రేకాల్లో** తేడా ఉంది: వారి ప్రాధాన్యతల్లో, సహవాసంలో తేడా ఉండటం ఫలితంగా వారి భావోద్రేకాల్లో కూడా తేడా వచ్చింది. మార్త తొందరపాటుతో, తాను చింతిస్తూ, ప్రభువుకు ఫిర్యాదు చేసి, విచారము కలిగి, విశ్రాంతి లేకుండా ఉంది. దేవాది

దేవుడైన యేసుక్రీస్తు ఆమె ఇంటిలోనే ఉన్నాడు కానీ ఆమెకు సంతోషం, సమాధానం లేకపోగా చింతిస్తుంది, సణుగులు ఆమె జీవితంలో ఉన్నాయి. మరియ అయితే ప్రశాంతంగా ఉండి యేసు జీవము కలిగిన మాటలు నేర్చుకొంటుంది.

4. వారిద్దరి గురించి ప్రభువు చెప్పిన మాటల్లో తేడా ఉంది: ప్రభువు మార్తతో "మార్తా, మార్తా – నీవు అనేకమైన పనులను గూర్చి విచారం కలిగి తొందరపడుచున్నావు. గానీ అవసరమైంది ఒక్కటే. మరియు ఉత్తమమైనదానిని ఏర్పరచుకొంది. అది ఆమెయొద్ద నుండి తీసివేయబడదని చెప్పాడు.

ఆయన కొరకు పనిచేయడంకంటే మొదట ఆయనతో ఉండటం, సహవాసం చేయడం శ్రేష్టమైనదని ప్రభువు చెప్పారు. విశ్వాసులంగా ఇది మన మొదటి ప్రాధాన్యత కావాలి. ఆయనతో ఉంటే ఆయన కొరకు పని చేయుటకు శక్తి, ధైర్యం వస్తాయి. ఆయనతో సన్నిహితంగా గడపలేనంత బిజీగా ఉంటున్నామా? దేవుని శాంతిని, సమాధానాన్ని మనం అనుభవిస్తున్నామా? మనల్ని మనం పరిశీలించుకోవాలి.

## ఆత్మీయ జీవితానికి ఎందుకు ప్రాధాన్యత ఇవ్వాలి?

1 తిమోతి4:7,8లో పౌలు తిమోతికి రాస్తూ "దైవభక్తి విషయం నీకు నీవే సాధకము చేసుకొనుము. శరీర సంబంధమైన సాధకము కొంచెముమట్టుకే ప్రయోజనకరమవును గాని దైవభక్తి ఇప్పటి జీవము విషయములో రాబోవు జీవము విషయములోను వాగ్దానముతో కూడినదైనందున అది అన్ని విషయములలో ప్రయోజనకరమవుతుంది. కాబట్టి ఆత్మీయ జీవితంలో ఎదుగుటకు సాధనము చేయాలి.

విశ్వాస విద్యార్థులుగా మనం పరలోక సంబంధులుగా ఆత్మీయ జీవిత ఎదుగుదలకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఎందుకంటే...

మన జీవితాలకు ఆధారం, ఆశీర్వాదం క్రీస్తులోనే ఉంది (ఎఫెసీ 1:3). మన పౌరస్థితి పరలోకమందు ఉంది (ఫిలిప్పీ 3:20). మొదటిగా ఆయన రాజ్యాన్ని నీతిని వెదకమని ప్రభువే చెప్పాడు (మత్తయి 6:33). ఆత్మానుసారమైన మనస్సు జీవమును సమాధానమునైయున్నది (రోమా 8:6).

## ఆత్మీయ ఎదుగుదలకు ఆటంకాలు

1. **సరైన తీర్మానం లేకపోవడం:** దేవునిలో ఎదగాలనే కోరిక మాత్రం ఉంటే సరిపోదు. ఆత్మీయ ఎదుగుదల అనేది ఆటోమాటిక్‌గా రాదు. సరియైన తీర్మానం, క్రమశిక్షణ ఉండాలి.
2. **పాపానికి దగ్గరవ్వడం:** పాపమునకు దూరంగా ఉండాలి. చీకటిలో నడువకూడదు (1 యోహాను 1:6). దేవుని నుంచి దూరం చేసే ప్రతి పాపానికి దూరంగా ఉండాలి. ప్రార్థన మనల్ని పాపం నుంచి దూరం చేస్తుంది. ప్రార్థనా లేమి పరిశుద్ధ జీవితానికి ఆటంకంగా ఉంటుంది.
3. **దేవునికి సమర్పించుకోకపోవడం:** యేసుక్రీస్తు నా జీవితానికి ప్రభువని సంపూర్ణంగా సమర్పించుకోకపోవడం.
4. **స్నేహాలు:** "మోసపోకుడి దుష్టసాంగత్యము మంచి నడవడిని చెరుపును" (1 కొరింథీ 15:33). కొన్ని సంబంధాలను వ్యక్తిగతంగా గాని, గ్రూప్‌గా గాని విడిచిపెట్టాల్సి వస్తే విడిచిపెట్టాలి. లేదంటే ఆత్మీయ ఎదుగుదలకు అవి అడ్డుగా ఉంటాయి.
5. **సోమరితనం, బిజీగా ఉండటం:** ఈ రెండు లక్షణాలు ఆత్మీయ ఎదుగుదలకు అడ్డు.

## ఆత్మీయ జీవితానికి ప్రాధాన్యత ఇవ్వకపోతే?

విశ్వాస జీవితంలో వెనుకబడిపోతాం. శోధనలు ఎదుర్కొనే శక్తి ఉండదు. వేషధారులుగా మారిపోయే అవకాశం ఉంటుంది. యేసుక్రీస్తు ప్రత్యక్షమైనప్పుడు మనకు మెప్పు, మహిమ, ఘనత కలుగదు (1 పేతురు 1:7).

## ఎలా ప్రాధాన్యత ఇవ్వాలి?

ప్రతిరోజు మౌనధ్యానం కలిగి ఉండాలి. ఏదో చేసుకోవాలి కాబట్టి హడావిడిగా కాకుండా అర్థవంతంగా దేవుని స్వరాన్ని వినాలి. వ్యక్తిగత ప్రార్థన సమయం, వ్యక్తిగత బైబిల్ స్టడీ చేసుకోవడం, కోర్ వ్యాల్యూస్ కలిగి ఉండడం, పరిచర్య కంటే ప్రభువుకు మొదటి స్థానాన్ని ఇవ్వడం నేర్చుకోవాలి.

– **నిర్మల మధు,** విజయనగరం




# ఒత్తిడిని తట్టుకొనే వజ్రమే విశ్వాసి

ఈ పోటీ ప్రపంచంలో పిల్లల పెంపకం, తక్కువ ఆదాయం, కుటుంబ పోషణ, పెరుగుతున్న ధరలు/ఖర్చులు, చేసిన అప్పులు, తల్లిదండ్రుల బాధ్యత, కుటుంబ కలహాలు, తప్పుడు అవగాహనలు, ఉద్యోగ బాధ్యతలు, ప్రమాదాలు, అకస్మాత్తుగా జరిగే కోవిడ్ వంటి విపత్తుల/సంక్షోభాల వలన మనం అనేక రకాలుగా ఒత్తిడికి గురౌతున్నాం. కొన్నిసార్లు మనం చేయాల్సిన పనులకంటే ఎక్కువ పనులు పెట్టుకొని ఎంతో ఒత్తిడిని ఎదుర్కొంటాం. అంతేకాదు క్రమం, సమయపాలన, క్రమశిక్షణ లేకుండా మనల్ని మనం ఎంతో ఒత్తిడికి గురిచేస్తున్నాం.

## ఒత్తిడి అంటే?

బయట ప్రపంచంనుండి ఎదురయ్యే పరిస్థితులకు మనం స్పందించినప్పుడు కలిగే భౌతిక, భావోద్రేకపరమైన శ్రమ, కొన్ని ప్రత్యేకమైన సంఘటనలకు మనము ప్రతిస్పందించినప్పుడు కలిగే అనుభూతినే ఒత్తిడిగా నిర్వచించవచ్చు.

## ఒత్తిడి ఎలా కలుగుతుంది?

ఒత్తిడిని ప్రేరేపించే సన్నివేశం లేదా సంఘటనలను ఒత్తిడి కారకాలు అంటారు. అటువంటి పరిస్థితులకు మానవ శరీరం ప్రతిస్పందించినప్పుడు నాడీ వ్యవస్థ, కొన్ని హార్మోన్‌లు ఉత్తేజితమవుతాయి. ముఖ్యంగా ఎడ్రినాలిన్, నార్ ఎడ్రినాలిన్, కార్టిసోల్ అనేవి అధిక పరిమాణంలో విడుదలవుతాయి. ఇవి హృదయ స్పందన, శ్వాస క్రియ వేగాలు, రక్త పోటు, జీవక్రియలను వేగవంతం చేస్తాయి. కండరాలకు ఎక్కువ రక్తాన్ని సరఫరా చేసేందుకు వీలుగా రక్తనాళాలు ఎక్కువగా తెరుచుకొంటాయి. కనుదృష్టిని వృద్ధిచేయటానికి కంటి పాపలు పెద్దవవుతాయి. శరీర శక్తిని పెంచటానికి కాలేయం తనలో నిల్వ ఉన్న గ్లూకోజ్ (చక్కెర)ను అధిక పరిమాణంలో విడుదల చేస్తుంది. శరీరాన్ని చల్లబరచటానికి ఎక్కువ చెమట పోస్తుంది. ఈ భౌతిక మార్పులన్నీ ఒక వ్యక్తి త్వరగా, ప్రభావవంతంగా బాహ్య ఒత్తిడిని తట్టుకోవడానికి సిద్ధపరుస్తాయి. స్వాభావికంగా జరిగే ఈ చర్యను స్ట్రెస్ మేనేజ్‌మెంట్ అంటారు. దీనిని సరైన విధానంలో ఉపయోగించుకొంటే ఒక వ్యక్తికి పనిచేసే సామర్థ్యము పెరుగుతుంది. అలాకాక ఎక్కువగా స్పందిస్తే కొన్ని సమస్యలు తలెత్తుతాయి.

## ఒత్తిడికి కారణాలు

స్ట్రెస్ అండ్ స్ట్రెయిన్ అనేవి ఒకే నాణానికికున్న బొమ్మ బొరుసు లాంటివి. మనలో ప్రతి ఒక్కరికి ఒత్తిడి సర్వసామాన్యం, 'ఒత్తిడి లేని జీవితం నిర్జీవం' అన్నాడో పెద్ద మనిషి. ఉద్యోగపరంగా పని ఒత్తిడి వలన, పనిచేసే స్థలంలో ఘర్షణల వలన, సమయపాలన సరిగ్గా లేకపోవడం వలన కొన్ని ఒత్తిడిలు కల్గితే, సహోద్యోగుల వలన, పై అధికారుల వలన, వ్యక్తిగత/అభిప్రాయ బేధాలు వలన, వేర్వేరు నిర్ణయాల వలన మనం ఒత్తిడికి గురౌతాం. అంతేకాదు, యుక్తవయస్సులో అడుగుపెట్టే సందర్భంలో మెనోపాజ్, నెలసరి ముందు, గర్భాధారణ తర్వాత కూడా ఎక్కువ ఒత్తిడికి గురికావచ్చు.

ఓటమి, పని సరిగ్గా నిర్వర్తించలేకపోవడం, డబ్బును సరిగ్గా, సమర్థవంతంగా నిర్వహించుకోలేకపోవడం వంటి మానసిక కారణాల మూలంగా, అనిశ్చితి, ఊహించని పరిణామాల మూలంగా, కొత్త ఉద్యోగం, కొత్త పని ప్రదేశం, తదనుగుణంగా సర్దుబాటు చేసుకోవడంలో కూడా కొంతమంది ఒత్తిడికి గురి అయ్యే అవకాశం ఉంది.


**అధిక ఒత్తిడికి కారణాలు:** ఆప్తులను కోల్పోవడం, కుటుంబ సమస్యలు, ఆర్థిక లావాదేవీలు, అనారోగ్యం, చదువు లేదా ఉద్యోగపరమైన ఇబ్బందులు, చెడిన బంధుత్వం, విడాకులు, నూతన సంబంధాలు, ట్రాఫిక్ జామ్, పరీక్షలు, భవిష్యత్‌ను గూర్చిన ఆందోళన / అనిశ్చితి, శబ్ద కాలుష్యము.

## ఒత్తిడి లక్షణాలు

ఒత్తిడియొక్క ప్రభావం అన్నిసార్లు, అందరిమీద ఒకేవిధంగా ఉండదు. పరిస్థితులమీద, వ్యక్తుల ప్రతిస్పందనల మీద ఆధారపడి ఉంటుంది.

**మానసికపరమైన లక్షణాలు:** ఉద్వేగము, ఆదుర్దా, చిరాకు, మతి స్థిమితము లేకపోవుట, ఏకాగ్రత లోపించుట, నిద్రలేమి, అభద్రతా భావము, మతి మరుపు, విచారము

**భౌతికపరమైన లక్షణాలు:** నోరు ఎండిపోవుట, గుండె బరువుగా ఉన్న అనుభూతి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, జీర్ణకోశ సంబంధ సమస్యలు, కండరాలు బిగుసుకు పోవటం, తద్వారా నొప్పి,




వణుకు, భరించలేని తలనొప్పి, అధిక మూత్ర విసర్జన, అరిచేతుల్లో చెమటలు, అధిక రక్తపోటు, ఎలర్జీ, ఆస్తమా, ఎక్జిమా, రోగ నిరోధక వ్యవస్థ బలహీన పడడం, సెక్స్ పట్ల ఆసక్తి తగ్గుట, 'డిప్రెషన్' – ఒత్తిడి తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు

**ప్రవర్తనాపరమైన లక్షణాలు:** అతిగా లేక తక్కువగా తినడం, భోజనాసక్తి, ఊరికే ఏడ్వటం, ఎవరితో కలవకపోవడం, బాంధవ్య సంబంధ సమస్యలు, వ్యసనాలు (పొగాకు, ఆల్కహాల్, డ్రగ్స్). ఇవేకాక ఇంకా అనేక లక్షణాలు కనిపించవచ్చు. వ్యక్తి మానసిక, శారీరక స్థితినిబట్టి, ఒత్తిడి తీవ్రతనుబట్టి లక్షణాలు మారుతుంటాయి. ప్రతి ఒక్కరి జీవితంలో ఒత్తిడి తప్పనిసరి. కొందరు కోపంతో అరుస్తూ ఇతరుల మీద ప్రదర్శిస్తారు. కొందరు లోలోపల అణచుకొని వ్యాధులబారిన పడతారు.

## ఒత్తిడి నిర్వహణలో లోకంతీరు

ఈ లోకం ఒత్తిడిని నియంత్రించేందుకు/ తగ్గించేందుకు యోగా, సంగీతం, శారీరక

వ్యాయామాలు/ఏరోబిక్స్, ఆల్కాహాల్, డ్రగ్స్, విపరీత వినోద కార్యక్రమాలు, మసాజ్‌లు, హెర్బల్/న్యూట్రిలైఫ్ ఆహారవస్తువులు, తాజా పండ్లను, కాయగూరలను తినడం, ఎక్కువ నీరు త్రాగడం, ఒత్తిడిని దూరంచేసే ఆటలు ఆడటం, గోరువెచ్చని నీటితో స్నానం చేయడం వంటివి చేస్తారు. కొంతమంది ఒత్తిడిని తట్టుకోలేక వ్యసనాలకు, విపరీతమైన ప్రవర్తనకు లోనవుతూ, చివరికి ఆత్మహత్యలకు కూడా పాల్పడతారు.

## దేవుని వాక్యం ఏమి చెబుతుంది?

అయితే దేవుని వాక్యము 'ఒత్తిడి' అనే పదాన్ని చెప్పకపోయినా ఆందోళన, చింత, బాధలను గూర్చి చెబుతూ వాటిని ఎలా ఎదుర్కోవాలో స్పష్టంగా తెలియజేస్తుంది.

ఒత్తిడికి విశ్వాసులు అతీతులు కాదు. మోరియా పర్వతం వద్ద అబ్రహాము (ఆది 22), ఎఱ్ఱసముద్రము దగ్గర మోషే (నిర్గమ 14), కర్మేలు పర్వతం వద్ద ఎలీషా (1 రాజులు 18) గెత్సేమనే తోటలో మన ప్రభువు ఆందోళనకు, ఒత్తిడికి గురైనట్లు తెల ుస్తుంది. అయితే వారు ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కోగలిగారు. మనం కూడా మన జీవితంలో ఎదురయ్యే ప్రతి ఆందోళనా పరిస్థితిని దేవునికి అప్పగి ంచినప్పుడు, దేవునిమీద ఆధారపడినప్పుడు దేవుడు మన మనస్సులకు నెమ్మదినిస్తాడు. "ఎవని మనస్సు ఆయన మీద ఆనుకొనునో వారిని పూర్ణశాంతి గల వానిగా కాపాడును" ( యెషయా 26:3)

ఏ రకమైన ఒత్తిడి అయినా జీవితంలో అంతర్భా గమే. అయితే దానిని ఎలా ఎదుర్కొంటున్నాం/ నిర్వహిస్తున్నామో అన్నది మనమీదే ఆధారపడి ఉంటుంది. మనంతట మనం దానిని పరి ష్కరించుకోవాలని ఆశిస్తే... ఎప్పటికి ముగి యని పోరాటమే అవుతుంది. అయితే దానిని సమర్థవంతంగా/ఫలభరితంగా ఎదుర్కోవాలంటే దేవుని వాక్యంలోని సూత్రాలను పాటించాలి. దేవుని వాక్యంలోని సూత్రాలను పాటించినప్పుడు విశ్వాసి ఒత్తిడిని తట్టుకొనే వజ్రంగా ఉంటాడు.

## ఒత్తిడి ఎదుర్కొనే సూత్రాలు/సూచనలు

1. మన గుర్తింపును తెలుసుకోవాలి (మత్తయి 4:1-11)
2. ఎవరిని సంతోషపెట్టడానికి ప్రయత్నిస్తున్నామో తెలుసుకోవాలి (యోహాను 8:20)
3. సరియైన/ఖచ్చితమైన లక్ష్యం ఉండాలి (యోహాను 8:14)
4. ఒకే దానిపై దృష్టి పెట్టాలి (లూకా 4:42-44)
5. అనవసరమైన పనులను ఇతరులకు బదిలీ చేయాలి (డెలిగేట్) (మార్కు 3:14)
6. వ్యక్తిగతంగా ప్రార్థించాలి (మార్కు 1:35)
7. విశ్రాంతి తీసుకోవాలి (మార్కు 6:30-32)
8. మన పనులభారాన్ని దేవునిమీద ఉంచాలి. అప్పుడు ఆయన మన ఉద్దేశాల్ని సఫలం చేస్తాడు (సామె16:3)
9. రేపటిని గూర్చి చింతించవద్దు (మత్తయి 6:34)
10. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి (ఎఫెసీ 5:15; కొలస్సీ 4:5)

## ముగింపు

ఒత్తిడి జీవితంలో ఒక భాగం, దానిని మనం నియంత్రణ చేయాలే కాని అది మనలను నియంత్రణ చేయకూడదు. మనం సరిగా పనిచేయడానికి, నూతన నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి, మన ప్రవర్తనను, జీవన శైలిని మార్చడానికి కొన్నిసార్లు ఒత్తిడి అవసరం. దీనిని మంచి ఒత్తిడి లేదా యూస్ట్రెస్ అంటారు. ఇది పరిమితికి మించితే ఒక వ్యక్తి శారీరక, మానసిక ఆరోగ్యాలపై ప్రభావం చూపుతుంది. దీన్ని చెడు ఒత్తిడి లేదా డిస్ట్రెస్ అంటారు. ఈ చెడు ఒత్తిడి ఒక్కోసారి శారీరక, భావోద్రేక, ఆత్మీయ సంబంధాలలో చాలా ప్రభావాన్ని చూపించి చివరకు దేవునితో మన సంబంధాన్ని, సహవాసాన్ని చెడగొట్టి దేవుని ప్రణాళికల నుండి బయటకు వచ్చేలా చేయగలదు. అందుకనే జీవితంలో ఎదురయ్యే ప్రతి పరిస్థితిలో దేవుని మీద ఆధారపడుతూ జాగ్రత్తగా ఉండాలి.

R – Realise your worth

E – Enjoy what you have

L – Limit your labour

A – Adjust your values

X – Exchange your pressure with Gods peace

**- డా. వి. ఇశ్రాయేల్ రాజు,** గుంటూరు



# కుటుంబ సమస్యల్లో
## విశ్వాస విద్యార్థులు

### కుటుంబ సమస్యలలో విశ్వాస విద్యార్థులు

మనం ఎక్కువగా ప్రేమించాల్సిన మన కుటుంబస్తులు ఎందుకో తరుచుగా ఒకరితో ఒకరు గొడవలు పెట్టుకొంటూ ఉంటారు. నాన్న మంచి వాడే, కానీ ఎందుకో అమ్మను మాత్రం సరిగా చూడడు, పైపెచ్చు పట్టించుకోడు, కొడతాడు కూడా. అమ్మ అందరితో చాలా మంచిగా ఉంటుంది కానీ, నాన్న మాట మాత్రము వినదు. అక్క చెల్లెలుకు అసలు పడటం లేదు. అన్నదమ్ములు మాట్లాడుకోరు. అమ్మ, నానమ్మ అయితే రోజు గొడవే. ఇంటిలో అసలు అందరు కలిసి సంతోషముగా చాలా అరుదుగా ఉంటారు. ఒకరితో ఒకరు సమాధానముగా, ప్రేమగా, సంతోషముగా, సంతృప్తిగా ఉంటే చూడాలని ఉంది. కానీ ఇంటిలో అలా ఉండదు ఎందుకో? మనస్సులో దిగులు, గుండెలో బాధ, ప్రశాంతత లేదు. మరి యేసుక్రీస్తు ప్రభువు సంబంధాలను బాగుచేయడానికే వచ్చాడు కదా! దానికోసమే తన రక్తాన్ని చిందించి ప్రాణము పెట్టాడు. ఆయనను విశ్వసించిన మనకు ఇలాంటి కుటుంబ సమస్యలు ఉన్నప్పుడు ఎలా అయనలో ఎదుగుతూ, కొనసాగుతూ, క్రీస్తును చూపిస్తూ కుటుంబంలో దేవుని కృపా మహిమకు కీర్తి కలిగేటట్లు జీవించగలం?

### కుటుంబ సంబంధాలు - కృపతో దేవుని బహుమానం


దేవుడు స్థాపించిన మొదటి వ్యవస్థ కుటుంబం (ఆది 2:22-24). కుటుంబములో భార్యాభర్తల మధ్య సహవాసము, సహకారము, సంభాషణ, సంతృప్తి,

సమైక్యత ఉండాలని దేవుని ఆశ. ఆది ఆదాము-హవ్వ కుటుంబాన్ని దేవుడు దీవించి ఫలించి భూమిని దేవుని ప్రతి రూపాలతో నింపాలన్నది దేవుని ఆజ్ఞ. విమోచన ప్రణాళికలో కుటుంబాలు సాధనాలుగా ఉండాలని, కుటుంబాలు త్రియేక దేవునిలోని సంబంధ బాంధవ్యాలకు ప్రతిరూపాలుగా ఉండాలనేది దేవుని ఉద్దేశం. కుటుంబ సంబంధాలకు త్రియేక దేవుడే మాదిరి. కుటుంబములోని భార్యాభర్తలను గూర్చి "దేవుడు కలిసిన దానిని మనుష్యుడు వేరుపరచకూడదని" (మత్తయి 19:6) యేసు ప్రభువు అన్నాడు.

## కుటుంబ సమస్యలు కొత్తేమీ కాదు

దేవుని నమూనాకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేసిన ప్రతి కుటుంబంలో సమస్యలు తలెత్తుతాయి. బహుభార్యాత్వం, వ్యభిచారం, విడాకులు ఇంకా ఎన్నో సమస్యలను కలిగిస్తాయి. ఎందుకంటే అవి దేవుని అసలు ప్రణాళిక నుండి వైదొలిగాయి.

దేవుని మాటను ధిక్కరించిన ఆది కుటుంబములో ఆదాము తను చేసిన పని సమర్థించుకోవడం కోసం హవ్వను నిందించాడు. అవ్వ తనను సమర్థించుకోవడం కోసం సర్పాన్ని నిందించింది (ఆదికాండము 3:12). ఆ విధంగా పాపము వలన పతనమైన లోకంలో అనేక కుటుంబ సమస్యలను బైబిల్ ఆదికాండములోనే నమోదు చేసింది. కయీను తమ్ముడైన హేబెలును ఈర్ష్యతో చంపేశాడు. ఏశావు-యాకోబు, యోసేపు-అతని సోదరుల కుటుంబ చరిత్రలో కూడా తోబుట్టువుల శత్రుత్వం చూస్తాము. ఏశావు నాన్న కొడుకు, యాకోబు అమ్మ కొడుకు. అమ్మ నాన్నలు పిల్లలను పక్షపాతముగా చూశారు. అబ్రహం విశ్వాసులకు తండ్రి అయినా తన ప్రాణాన్ని కాపాడుకోవటం కోసం తన భార్యను రెండుసార్లుఫణంగా పెట్టాడు. శారా తన దాసి హాగరును అన్యాయముగా ఉపయోగించుకొన్నది. తాగుడు మనిషిని ఎలా విచక్షణా రహితంగా చేస్తుందనేదానికి లోతు అతని కుమార్తెలే ఉదాహరణ. బహుభార్యాత్వం దేవుని పద్ధతికాదు. అయినా అనేక భార్యలను తెచ్చుకొన్న ఫలితముగా భార్యల మధ్య అసూయ ఏర్పడింది. లేయా-రాహేలు, హన్నా- పెనిన్నాలే ఉదాహరణ. కుటుంబ యజమానిగా ఎలీమెలెకు చేసిన ఎంపిక కుటుంబంలో తీరని దు:ఖానికి కారణమైంది. ఏలీ, సమూయేలు లాంటి ప్రవక్తల కుటుంబాల్లో



దారితప్పిన పిల్లలు ఉన్నారు. యోనాతానుకు తండ్రి సౌలుతో సరైన సంబంధాలు లేకపోవడం. తన కుమారుడైన అబ్షాలోము తిరుగుబాటుతో దావీదు ప్రాణము కొరకు పరిగెత్తి మనసు వేసారి పోయింది. హోషేయా ప్రవక్త వైవాహిక సంబంధమైన ఇబ్బందులను ఎదుర్కొన్నాడు. ఈ సందర్భాలన్నిటిలో పాపం సంబంధాలను దెబ్బతీసింది.

## కుటుంబ సభ్యులపై కుటుంబ సమస్యల ప్రభావం

కుటుంబ సభ్యులు వారి మధ్య సంబంధాలు అత్యంత ప్రాముఖ్యమైనవి , ప్రియమైనవి కాబట్టి ఇంటిలో సమస్యలు ఉంటే అవి చాలా బాధ కలిగిస్తాయి. భావోద్వేగాలు - కోపం, విచారం, ఆందోళన, ఒత్తిడి, ఆయాసం, గందరగోళం, ఒంటరితనము ,ఏకాగ్రత లేకపోవడం, తినాలని అనిపించకపోవడం, నిద్రపట్టకపోవడం, అభద్రత, దిగులు, చదవాలనిపించకపోవడం, నిరాశ ఇంకా అనేక రకాలుగా ఇబ్బంది పెడతాయి. అనారోగ్య సమస్యలు, ఆత్మీయ సమస్యలు తలెత్తుతాయి. నాకే ఎందుకిలా అని అనేక ప్రశ్నలు వచ్చి అయోమయం, ఆవేదనకు గురిచేస్తాయి.

## కుటుంబ సంబంధాలలో ప్రవర్తనకు దేవుని నమూనా తెలియాలి

బైబిల్లో పిల్లలకు దేవుడిచ్చిన ఆజ్ఞ మేరకు షరతులు లేకుండా తల్లిదండ్రుల పట్ల సన్మానం, గౌరవం చూపించాల్సిందే (నిర్గ 20:12; ద్వితీ5:16; ద్వితీ15:16; ఎఫెసీ 6:2). వారి బాగోగులు బాధ్యతగా చూస్తూ వారికి సేవచేయాలే కానీ 'దేవుని సేవ' పేరుతో అశ్రద్ధ చేయకూడదు (మత్తయి15:4-6). అయితే విశ్వాస విషయంలో సమస్యలు రాక మానవని యేసుప్రభువు చెప్పిన మాటలు జ్ఞాపకము చేసుకోవాలి (మత్తయి10:34-37). కావున పౌలు



కూడా ఈ నేపథ్యాన్ని పరిగణలో తీసుకొని విశ్వాస విషయములో, ప్రభువుకు నమ్మకమైన శిష్యరికం చేయడంలో పిల్లలకు "పిల్లలారా, ప్రభువునందు మీ తలిదండ్రులకు విధేయులైయుండుడి; ఇది ధర్మమే" (ఎఫెసీ 6:1) అని భోదించాడు. కనుక విశ్వాస విషయములో వచ్చే ప్రతివిధమైన సంఘర్షణ, ఆందోళన, సమస్యలను ప్రార్థనతో, ప్రేమతో, ఓర్పుతో గౌరవముకు మాత్రమూ తక్కువ చేయకుండా ప్రభుకోసము నిలబడి కొనసాగాలే కానీ సమస్యల నుండి, శ్రమలనుండి పారిపోకూడదు. సహోదరులు ఐక్యత కలిగి ఉంటే అది ఆశీర్వాదం అని లేఖనం చెబుతుంది (కీర్తన 133).

## కుటుంబ నేపథ్యాలు విభిన్నము, విశిష్టము, యునీక్

విద్యార్థుల/విశ్వాసుల తల్లితండ్రులు క్రైస్తవ విశ్వాస విషయములో వేరువేరు నేపథ్యాలనుండి రావచ్చు. అవిశ్వాసులు, నామమాత్ర క్రైస్తవులు, లోకానుసార విశ్వాసులు కావచ్చు, విశ్వాసులే కానీ సెల్ఫ్ కంట్రోల్ లేని కోపిష్టులు, నిష్ఠుర పెట్టేవాళ్ళు కావచ్చు. తల్లిదండ్రుల్లో ఒకరే విశ్వాసి అయివుండొచ్చు. కానీ ముందుగా అనుకున్నట్టు ప్రతివిశ్వాస విద్యార్థి తన కుటుంబం కృపతో దేవుని బహుమానమని, సార్వభౌమ దేవుని ప్రొవిడెన్స్‌లో ఒక ప్రోవిషన్ అని, విశిష్టమైన, యూనిక్ నేపథ్యమని గ్రహించాలి, అంగీకరించాలి, ఆనందించాలి, కృతజ్ఞతతో దేవుని స్తుతించాలి. దేవుని సహాయంతో కుటుంబస్తులను దేవుని విశ్వాసములోనికి నడిపించడానికి దేవుడిచ్చిన గొప్ప భాగ్యం, బాధ్యత అని దేవుని ఆశ్రయించాలి. కొన్నిసార్లు తల్లిదండ్రులిద్దరూ ఉండకపోవచ్చు ఎస్తేరులా, అంతేకాని నితరులుతో పోల్చు కొని సణుగుకోవటం, సెల్ఫ్‌పిటితో కృంగిపోవడం చేయకూడదు, నిందించకూడదు. అలాగే మంచి కుటుంబ నేపథ్యాన్ని బట్టి గర్వించకూడదు. ఎందుకంటే ఉప్పొంగటానికి అది మనం సంపాదించింది కాదు దేవుని అనుగ్రహం.

## ఏ కుటుంబము సమస్యలకు అతీతము కాదు

ఏ విశ్వాస నేపథ్యం నుండి వచ్చినా, ప్రతి కుటుంబంలో, సంబంధ బాంధవ్యాలలో సమస్యలుంటాయని గ్రహించాలి. మేము సమస్యలకు అతీతం అని చెప్పడానికి మనం పర్ఫెక్ట్ మనుష్యులము కాదు కదా! అయితే, సమస్యలలో సమాధానంతో, సంతోషంగా ఉండే సంబంధాలు సాధ్యమా! అంటే సాధ్యమే కానీ అవి ఆటోమేటిక్‌గా రావు. కేవలము యేసు ప్రభువు రక్తముద్వారా మాత్రమే సంబంధాలలో సమాధానము వస్తుంది. ఎఫెసీ 2:16లో పౌలు యేసుప్రభు సిలువ వలన ద్వేషాన్ని సంహరించి దేవునితో సమాధానపరచి మన సమాధాన కారకుడుగా ఉన్నాడని రాశాడు. గనుక మన దిన దిన అనుభవంలో ఇది వాటంతటికి అవే రావని అర్థం చేసుకొని మనం సహనంతో, సాత్వికంతో ప్రేమతో ఓర్పుతో దేవుని ఆత్మసహాయంతో సంబంధాలను కట్టుకోవాలి, కాపాడుకోవాలి. అయితే కొన్నిసార్లు దేవుని విలువల్ని పాటించే విషయంలో, దేవుని చిత్తం చేసే విషయంలో ఈ సంబంధాలే అడ్డుకొంటాయి. ముఖ్యంగా క్రైస్తవేతర విశ్వాస నేపథ్యంనుండి ప్రభువును నమ్మి వెంబడించేటప్పుడు అనేక సమస్యలు, శ్రమలు వస్తాయి. వాటిని సహించి, తట్టుకొని దేవుని వెంబడించటం విశ్వాస విద్యార్థికి ఒక సవాలు. కానీ దేవుని తోడు, సహాయం. సహవాసం, ప్రోత్సాహం, దన్ను ఎప్పుడూ ఉంటుందని మర్చిపోకూడదు.

## క్రీస్తుప్రభువును అనుసరించడం అంటే కుటుంబాన్ని విడిచిపెట్టడమేనా?

"తండ్రినైనను తల్లినైనను నా కంటె ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడుకాడు; కుమారునినైనను కుమార్తెనైనను నాకంటె ఎక్కువగా ప్రేమించువాడు నాకుపాత్రుడు కాడు" (మత్తయి10:37; లూకా14:26) అని ప్రభువు చెప్పాడు. యేసును అనుసరించడం అంటే కుటుంబాన్ని, కుటుంబ సంబంధాలను విడిచిపెట్టడమే అని యేసయ్య కొత్త బోధ చేశారా? కానేకాదు, మోషే లేవి గోత్రాన్ని గురించి ద్వితీయో. 33:9లో "అతడు నేను వానినెరుగనని తనతండ్రిని గూర్చియు తన తల్లినిగూర్చియు అనెను. తన సహోదరులను లక్ష్యపెట్టలేదు తన కుమారులను

కుమారులని యెంచలేదు వారు నీ వాక్యమునుబట్టి నీ నిబంధనను గైకొనిరి." అని చెప్పాడు. కనుక విశ్వాసములో నిలిచి అత్యున్నత ప్రేమను దేవునికి మాత్రమే చూపాల్సిన పరిస్థితులలో "సహోదరుడు సహోదరుని, తండ్రికుమారుని, మరణమునకు అప్పగించెదరు; పిల్లలు తలిదండ్రులమీద లేచి వారిని చంపించెదరు. సొంతయింటివారే శత్రువులు అవుతారని, అందరి చేత ద్వేషింపబడుదురు; అంతమువరకును సహించిన వాడు రక్షింపబడును" (మత్తయి 10:21-35-3, మార్కు 13:12, లూకా12:53) అని యేసయ్య చెప్పారు. విశ్వాసములో కొనసాగటానికి ఎదురయ్యే ప్రతి కుటుంబ సమస్యలో యేసయ్య నిమిత్తమును సువార్త నిమిత్తమును ఇంటినైనను అన్నదమ్ములనైనను అక్క చెల్లెండ్రనైనను తలిదండ్రులనైనను పిల్లలనైనను భూములనైనను విడిచినవాడు, ఇప్పుడు ఇహమందు హింసలతో పాటునూరంతలుగా ఇండ్లను అన్నదమ్ములను అక్కచెల్లెండ్రను తల్లులను పిల్లలను భూములను, రాబోవు లోకమందు నిత్యజీవమును నిశ్చయముగా పొందుతారని చెప్పబడింది (మార్కు10: 29, 30). అన్యురాలైన రూతు తన స్వజనులను, తండ్రి యింటివారిని విడిచి యెహోవా దేవుని తన దేవునిగా అంగీకరించి హత్తుకొన్నందున యేసుక్రీస్తు వంశావళిలో చేర్చబడింది.

## కుటుంబస్తులను క్షమించడాన్ని ఎంచుకోవడం

ఈర్ష్యతో అన్నలు తనను చంపాలని అనుకొన్నా వారిని ప్రేమించి, క్షమించి వారి క్షేమం కోసం పాటుపడిన యోసేపు మనకు మాదిరి. దేవుని అపారమైన ఔదార్యాన్ని దృష్టిలో ఉంచుకొని, పగ అనే చెరసాలలో మనం ఎలా బంధించబడగలం? గనుక కుటుంబంలో క్షమాపణను ఎంచుకోవాలి. క్రీస్తు మనల్ని స్వేచ్ఛగా, ఉదారంగా క్షమించినందున మనం కూడా ఒకరినొకరు స్వేచ్ఛగా, ఉదారంగా క్షమించుకోవాలి.

మీ కుటుంబం మిమ్మల్ని అర్థము చేసుకోలేకపోతే, మీ విశ్వాసాన్ని భక్తిని మెచ్చుకోకపోతే, హృదయంలో కలవరపడవద్దు, ధైర్యముగా ఉండండి. సొంతకుటుంబంలోనే యేసయ్యకు కూడా ఇబ్బందులు ఉన్నాయని లేఖనాలు చెపుతున్నాయి. సొంత ఊరివారు కూడా ఆయనను అర్థం చేసుకోలేదు (మార్కు6:3). ఆ వేదన ఆయన కూడా అనుభవించాడు. యేసయ్య



తనసోదరుల యొక్క ప్రవర్తనను నియంత్రించడానికి ప్రయత్నించలేదు, వారుతనతో ఏకీభవించాలని యేసయ్య డిమాండ్ చేయలేదు. వారు తనను అవమానించినప్పుడు బాధపడినప్పటికీ వారిని సంతోషపెట్టడం తన లక్ష్యంగా చేసుకోక తన పరలోక తండ్రిని సంతోషపెట్టటమే గురిగా జీవించాడు.

## సమస్యలను అధిగమిద్దాం- కుటుంబాలను దేవునికొరకు సంపాదిద్దాం

ప్రస్తుత సమకాలీన సమస్యలతో సతమతమవుతున్న కుటుంబ నేపధ్యాలనుండి వచ్చిన విద్యార్థులు/గ్రాడ్యుయేట్స్ తమ విశ్వాసాన్ని కాపాడుకొంటూ కుటుంబాలను దేవుని కొరకు గెలవాలంటే తెలుసుకొని ఆచరించాల్సిన కొన్ని ఆత్మీయ సత్యాలు.

**1. ప్రార్థించాలి:** కుటుంబములోని వారి రక్షణ కొరకు, దేవుని వాక్యములో నిలిచి ఉండేటట్లు విశ్వాసముతో ప్రార్థించాలి. నీ విశ్వాసాన్ని బట్టి నీ ఇంటివారు రక్షింపబడతారనే వాగ్దానాన్ని (అపో. కార్య. 16:31) ఎత్తిపడుతూ పట్టుదలగా విసుగక ఎల్లప్పుడూ ప్రార్థించాలి

**2. ప్రేమించాలి:** యేసు మనసుతో ప్రేమించాలి, ప్రేమను చూపించాలి,

**3. ప్రార్థన సహాయం తీసుకోవాలి:** సమస్యలను మనము ఒక్కరమే ఒంటరిగా పోరాడనవసరం లేదు. ఎందుకంటే దేవుడు సహవాసంను ఇచ్చాడు. యేసయ్యకూడా మిక్కిలి శ్రమలో శిష్యులను తనకోసము ప్రార్థించమన్నాడు. ప్రార్థనలో మన భారాలు పంచుకోడానికి, ఒకరి భారాలు ఒకరు మోయటానికి, బరువులను ప్రభువు దగ్గరకు తీసుకురావడానికి దేవుడు ఇచ్చిన గొప్ప ప్రొవిషన్. కొన్నిసార్లు సమస్యలను గోప్యంగా ఉంచాల్సిన అవసరం ఉన్నప్పుడు అందరితో చెప్పకుండా, కాన్ఫిడెన్షియల్‌గా ఉంచగల చిన్నగుంపుతో లేదా

ఒకరితో చెప్పి ప్రార్థనా సహాయాన్ని కోరాలి. ఈ విషయంలో మైక్రో ప్రేయర్ సెల్స్ మనకు ఎంతో సహాయపడతాయి.

**4. శత్రువుతో పోరాడాలి:** కుటుంబాలలోని సమాధానాన్ని, సంతోషాన్ని దొంగిలించడానికి, సంబంధాల్ని నాశనము చేయటానికి, చంపడానికి వచ్చే దుష్టుణ్ణి ఆత్మీయ నేత్రాలతో చూడగలగాలి. దుష్టుని ప్రతి ఆయుధాన్ని యేసునామములో లయం చేయాలి. ఎఫెసీ6వ అధ్యాయములో చెప్పినట్టుగా మన పోరాటం మనప్రియులుతో కాదు వారి వెనుకున్న దురాత్మ సమూహాలతోను వాయుమండల అధిపతి అయిన సాతానుతో. గనుక దేవుడిచ్చిన సర్వాంగ కవచాన్ని ధరించి పరిశుద్ధాత్ముని శక్తితో సాతాను, అతని సమూహాలతో యుద్ధము చేసి వాటిని యేసునామములో బంధించాలి, పొమ్మని ఆజ్ఞాపించాలి, సమాధానాన్ని విడుదల చేయాలి.


**5. ప్రకటించాలి:** యేసునామములో విశ్వాసముతో శత్రువును బంధించటం మాత్రమే కాదు కానీ యేసయ్యయిచ్చిన అధికారంతో, యేసునామములో సమాధానాన్ని, సంతోషాన్ని డిక్లేర్ చేయాలి.

**6. ఓపికతో కనిపెట్టాలి:** దేవుడు చేయగలడు అనే విశ్వాసముతో ఓపికగా కనిపెట్టాలి, వేచియుండాలి.

**7. ప్రభువు మనతో ఉన్నాడు:** సర్వభౌముడైన దేవుడు మనతో ఉన్నాడు. మనకెందుకిక దిగులు? ప్రతిసంబంధాలను ప్రభురక్త ప్రోక్షణ కిందకు తెద్దాం. ప్రతి వ్యక్తి, కుటుంబం చుట్టూ ప్రభువే కంచెగా ఉండాలని ప్రభుని అడుగుదాం. అడుగువాటికంటే ఊహించువాటికంటే అత్యధికముగా చేయ శక్తి గల దేవుడు మనకుండగా ఆయనకే అప్పగించుకొందాం.

మన విశ్వాసమునకు కర్త దాన్ని కొనసాగించువాడైన యేసు వైపు చూస్తూ ప్రస్తుత శ్రమలు ఎన్నదగినవి కావని తెలిసికొని ప్రభువు కొరకు నిందలు భరిస్తూ, నిరీక్షణతో నిబ్బరంగా సాగిపోతూ, నెమ్మదిని అనుభవిస్తూ, పవిత్రమైన ప్రవర్తన కలిగి ఉందాం. మన తల్లితండ్రులను, తోబుట్టువులను, ఇతర కుటుంబస్తులను ప్రభువు దగ్గరకు తీసుకొద్దాం. అలా ప్రభావితము చేయుటకు దేవుడు తన శక్తిని మనకిచ్చి దీవించును గాక! ఆమెన్.

**– బి. రంగనాథం, డా. జే. రత్నాగ్రేస్,** వైజాగ్





# హృదయపు వాకిట...

మార్చి 5వ తేదీ 2022. టైం అర్ధరాత్రి పన్నెండు గంటలు దాటింది. సెల్ఫోన్ బటన్స్ నొక్కినొక్కి సంతోష్ వేళ్ళు నొప్పిపుట్టసాగాయి. కళ్లు భారంగా మూతలు పడుతున్నాయి. ప్రతీ అరనిమిషానికి వచ్చే ఆవులింత నిద్రను గుర్తుచేయసాగింది.

కాలేజ్ నుంచి రాగానే రెండు గంటలసేపు, ఆ తర్వాత రాత్రి భోజనం అవగానే పడకగదిలోకి వచ్చి తలుపేసుకుని మొబైల్ చూస్తూ కూర్చున్నాడు. మధ్యలో ఏవో ఫోన్ కాల్స్ వస్తే ముఖం చిరాకుగా పెట్టి ఆన్సర్ చేయలేదు. గంటసేపు ఓపెన్ చేయకపోతే కొంపలంటుకుపోయినట్లుగా గుట్టలు గుట్టలుగా పేరుకుపోతున్న మెసేజ్‌లవైపు చూశాడు. వాట్సాప్ నిండా స్నేహితుల హాయ్, బాయ్ సందేశాలు, కొత్త సినిమా కబుర్లు, అమ్మాయిల కబుర్లు, హీరోలేసుకొనే బట్టలు, కొత్త కొత్త మోడల్స్, హీరోయిన్లకొచ్చే అవకాశాలు, వాటివెనకుండే దర్శక నిర్మాతలు... కొత్తిమీర కట్టనుంచి కొరియా దాకా దేన్నీ వదలకుండా ఫొటోలు, వీడియోలు షేర్ చేసుకొంటూ ఆనందంలో మునిగితేలుతున్నాడు.

మధ్యలో ఒకసారి తల్లి వచ్చి లైట్ తీసి తొందరగా పడుకో, ఆరోగ్యం పాడవుతుందని హెచ్చరించింది. తల్లి బాధ పడలేక తప్పదన్నట్లుగా లైట్ తీసి దుప్పటి మీదకి లాక్కుని ఫేస్‌బుక్ ఓపెన్ చేశాడు.

ప్రపంచమంతా నగ్నరూపాన్ని ధరించి ఆ అర్ధరాత్రి అతని అరచేతిలో ఇమిడిపోయింది. తనకా పోస్టింగ్‌లతో ఏమీ సంబంధం లేదు. ప్రతీ మెసేజ్ చదవాల్సిన అవసరం కూడా లేదు. అయినా అరచేతిలో ఇమిడిపోయిన స్వర్గాన్ని వదలడానికి అతని మనసు అంగీకరించడం లేదు. సెల్ఫోన్ కాంతి కిరణాలు కంటిచూపును తీక్షణంగా చూడనీయట్లేదు. కళ్లను నలుపుకొంటూ మూసి తెరుస్తున్న కళ్లతోనే బలవంతంగా సెల్ఫోన్ వైపు చూస్తున్నాడు.

నిద్రపోవాలనుంది.... పోతే దేన్నో కోల్పోతాననే భావం అతనిని నిలవనీయడం లేదు. బలవంతంగానే స్నేహితుల మెసేజ్‌లకు సమాధానం ఇస్తున్నాడు. వాట్సప్ ఆపితే ఫేస్‌బుక్‌లో సందేశాలు, ఫేస్బుక్కులో ఆపితే వాట్సాప్‌లో సందేశాలు.... ఉక్కిరి బిక్కిరి చేస్తూ కళ్లనూ, వేళ్లను వేగంగా కదిలేటట్లు చేసి అతనిని ఛాటింగ్‌లో లీనం చేస్తున్నాయి.

వీటివల్ల అతనికి ఏం లాభమో అతనికి కూడా తెలియదు. కాలేజీకి వెళ్ళినప్పుడల్లా స్నేహితుల సంభాషణల్లో విన్న విషయాలు అతనిలో ఆసక్తిని కలిగించాయి. అతని అడుగులు దానివైపు పడేలా చేశాయి. సరదాగా ఎకౌంట్ ఓపెన్ చేశాడు. కొత్తలో ఏదో తెలియని హాయిగా ఉత్సాహంగా ఉల్లాసంగా

ఉండేది. తొందరగా 'టైప్ చేస్తున్నావని' స్నేహితులు పొగుడుతుంటే అతనికి తెలియకుండానే అందులో కూరుకుపోయాడు. టైం తెలియదు, సమయానికి ఆకలి గుర్తుకురాదు. తల్లీతండ్రీ ఏదైనా అడిగినా ఏదో ముక్తసరి సమాధానం తప్ప మనస్ఫూర్తిగా పెదవుల నుండి ఒక్క మాటా బయటికి రాదు. సరదాగా మొదలుపెట్టాడు. బయటికి రావాలని అప్పుడప్పుడూ అనిపించినా బలంగా బిగుసుకున్న సంకెళ్ళేవో ఇంకా గట్టిగా బంధించి ఆ అలవాటు మానుకోకుండా చేస్తోంది. వచ్చే నిద్రను బల వంతంగా ఆపుకోవడం వల్ల, నిజంగా నిద్ర పోవాల నుకొన్నప్పుడు నిద్ర వచ్చేది కాదు. నీటిలోని చేప ఒడ్డున పడ్డప్పుడు కొట్టుకున్నట్లుగా నిద్రకోసం అతని ప్రాణం కొట్టుమిట్టాడుతూ ఏ తెల్లవారుజామునో విశ్రమించేది.

***

ఉదయం పదిగంటలు దాటింది. కాలేజ్‌కి టైం అవుతుందని అప్పటికే రెండుసార్లు తల్లి తలుపుకొట్టి పిలిచినట్లుగా అనిపించింది సంతోష్‌కి. అయినా భారంగానూ, బరువుగానూ మూతలుపడుతున్న కనురెప్పల్ని తెరిచి పక్కమీద నుండి లేచే ప్రయత్నం చేయలేకపోయాడు. కాసేపయ్యాక మంటలుగా అనిపిస్తున్న కళ్లను నులుముకొంటూ బయటికి వస్తున్న కొడుకును చూసి "అదేంట్రా... రాత్రంతా నిద్రలేనట్లుగా కళ్లు అలా పీక్కుపోయాయ్! సరిగా నిద్రపట్టలేదా?" అంది తల్లి.

కంగారుపడ్డాడు సంతోష్. కాసేపు అటూ ఇటూ దిక్కులు చూసి "కొంచెం ఎక్కువసేపు చదువుకున్నానమ్మా..." అన్నాడు. ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్న తల్లిని చూసి మనసులో బాధపడ్డాడు సంతోష్. చిన్నచిన్న పనులు చేస్తూ తండ్రి లేని నాలోనే లోకాన్ని చూసుకొంటూ నా కోసమేబతుకుతున్న తల్లి కళ్లల్లో ఆ నిమిషం కనిపించిన ఆనందాన్ని విచారంగా చూస్తూ గబగబా తయారై కాలేజ్ వైపు నడక సాగించాడు.

***

"హాయ్ తమ్ముడూ... ఎలా ఉన్నావు? నిన్న బైబిల్ స్టడీకి వస్తానని రాలేదు. ఏదైనా పనిలో ఉన్నావా?" అని అడుగుతున్న సంజీవ్ వంక ఆశ్చర్యంగా చూస్తూ నుదురు చిట్లించాడు సంతోష్. 'ఎక్కడికి వెళ్తే అక్కడికి వచ్చేస్తాడు. పీడలాగా తయారయ్యాడు' అని మనసులో అనుకొంటూ "హాయ్ అన్నా... బాగున్నారా?" అన్నాడు సంతోష్.

"హా... తమ్ముడూ! నీకులాగా ఇప్పుడిప్పుడే దేవునిని తెలుసుకుంటున్న మరో నలుగురు స్టూడెంట్స్ కూడా ఆన్‌లైన్ బైబిల్ స్టడీకి వచ్చారు, కరోనా వల్ల బయట కలవడానికి కుదరట్లేదుగా. ఇప్పుడన్ని మీటింగులూ ఆన్‌లైన్‌లోనే అందుకే ఇంట్లో ఉంటే మీటింగ్‌కి అటెం డవతావని నిన్ను రెండుసార్లు ఫోన్ కూడా చేశాను. నువ్వు తియ్యలేదు..." అన్నాడు సంజీవ్. సంతోష్ లోని అబద్ధికుడు మరోసారి బయటికొచ్చాడు.

సంజీవ్ వైపు చూస్తూ "అయ్యో... అన్నా... అదీ... నిన్న మా ఫ్రెండ్‌కి బాగోపోతే హాస్పిటల్ దగ్గరకు వెళ్లానన్నా. చాలాసేపు అక్కడే ఉండాల్సి వచ్చింది. మీరు ఫోన్ చేసినప్పుడు అక్కడే ఉన్నానన్నా..." అన్నాడు.

"అయ్యో! అవునా. పర్లేదులే తమ్ముడూ. బైబిల్ స్టడీకొస్తే ఏవో నాలుగు మంచిమాటలు వింటావనే గానీ మరో ఉద్దేశం కాదులే. మనకి ప్రతీ బుధవారం బైబిల్ స్టడీ ఉంటుంది తమ్ముడూ... నిన్న కుదరలేదు గనుక వచ్చేవారం అయినా రావడానికి ప్రయత్నించు... ఎలాగూ నీ దగ్గర స్మార్ట్ ఫోన్ ఉంది కనుక ఇబ్బంది కూడా లేదు..." అన్నాడు సంజీవ్.

"అలాగే అన్నా... ఈసారి తప్పకుండా వ...స్తా... ను..." చెప్తుండగానే పెద్దగా వాంతి అయిపోయింది సంతోష్‌కి. ఉన్నవాడు ఉన్నట్లుగానే నీరసంగా కుప్పకూలిపోసాగాడు. అతన్ని ఆ స్థితిలో చూసిన సంజీవ్ కంగారుపడి ఆటోను పిల్చి అందులో కూర్చోబె ట్టుకొని దగ్గర్లో ఉన్న ఆసుపత్రికి తీసుకెళ్ళాడు.

***

ఆసుపత్రి బెడ్‌మీద సెలైన్ బాటిల్తో నీరసంగా ఉన్న సంతోష్‌ని చూస్తూ పక్కనే ఉన్న స్టూల్ మీద కూర్చుంటూ "ఇప్పుడు కొంచెం తేలికగా ఉందా తమ్ముడూ..." అనడిగాడు సంజీవ్.

కళ్లల్లోనుంచి అప్రయత్నంగా ధారాపాతంగా నీళ్ళు కారసాగాయి. మొదటిసారి కన్నీళ్ళు బలమైనవని, విలువైనవని సంతోష్‌కి తెలిసొచ్చింది. పనికిరాని వాటికోసం, వ్యర్థమైన వారికోసం వెంపర్లాడి ఎన్నో కన్నీళ్ళను వృథా చేశాడు. మొదటిసారి ఆత్మీయమైన పిలుపేదో సంతోష్ గుండెల్ని బలంగా తాకింది. అతనిలో అతనికి తెలియకుండానే గుండెల్లో

పశ్చాత్తాపపు మబ్బులు ధారాళంగా కమ్ముకొని వర్షం కురిసినట్టు కన్నీళ్ళు ధారాపాతంగా వచ్చాయి.

కొంత సేపటి తర్వాత కళ్ళు తుడుచుకుంటూ "నన్ను మన్నించన్నా. నీకు అబద్ధం చెప్పాను" అన్నాడు బలహీనంగా.

అతనివంక చూసి చివరున నవ్వాడు సంజీవ్. తర్వాత నెమ్మదిగా సంతోష్ తలమీద చేయివేసి "నీ వయసు వాళ్ళు అంతా మాకే తెలుసనే భ్రమల్లో ఉంటారు తమ్ముడూ. ఏదైనా చేసేయగలమనే ధీమాతో ఉంటారు. అది తప్పు కాదు, ఆత్మవిశ్వాసం కలిగి ఉండడం నేరం కూడా కాదు! కానీ ఏ దారిలో వెళ్తున్నావో చూసుకోవలసిన బాధ్యత, అవసరం మాత్రం మీ మీదే ఉంది. నువ్వు కన్నతల్లిని మోసం చేశానని, నాలాంటి వాడిని మోసం చేశానని సంతోషపడొచ్చు గానీ దానివల్ల నిన్ను నువ్వు ఎంత మోసపర్చుకొంటున్నావో గ్రహించట్లేదు. పనికిరానిదే అవసరమనీ, అవసరమైనదంతా పనికిరానిదనీ నువ్వు ఏర్పర్చుకున్న అభిప్రాయం నిన్ను నరకానికి, నాశనానికి ఈడ్చుకొపోతుంది. పశ్చాత్తాపానికి మించిన ప్రాయశ్చిత్తం లేదు, ఇప్పుడైనా కళ్ళు మూసుకొని మనసులో ప్రార్థన చేసుకో. 'నన్ను నేను సమర్పించుకొంటున్నానని' దేవుని వేడుకో. నీ హృదయపు వాకిలిని తెరిచి ఆ ప్రభువును ఆహ్వానించు. నీలో నీకు తెలియని మార్పు జరుగుతుంది. నూతన జీవం నీలో నింపబడుతుంది. నువ్వు వెలగడమే కాకుండా నీలాంటివాళ్లని మరో నలుగుర్ని వెలిగించగలుగుతావు..."

భుజం తడుతూ చెప్తున్న సంజీవన్న మాటలు సంతోష్‌లో నూతనజీవాన్ని నింపాయి.

**– డా. జడా సుబ్బారావు,** నూజివీడు

# Crossword Puzzle




| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | | 3 | 4 | |
| | 5 | 6 | | | | | |
| | | 7 | | | | | 8 |
| 9 | | | | | | | |
| | | | | | | | |
| 10 | | | | | | | |

**Horizontal**

1. The Man who was unholy amid holiness
6. The Elder son of Issac
7. Name means admirable, a son of Reuben
9. Name means pity, love, a son of Shema
10. The Man who made Isreal sin

**Vertical**

2. The youngest son of Gilead
3. The father of Michaiah
4. The cruel roman Governor
5. The man was obedient when appointed a difficult task
8. Son of Sheresh, who is grandson of Manassah

*Please find out the hidden words in the puzzle using the clues/hints and send to Nambur office within 15 days.*

**Last month key:**

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| H | I | G | H | F | I | E | L | D |
| N | F | | | | N | | | F |
| A | E | M | E | N | T | O | R | D |
| M | S | | E | N | O | C | H | |
| B | G | R | A | D | U | A | T | E |
| U | N | R | E | A | C | H | E | D |
| R | O | P | E | N | H | O | M | E |

1. *M. Ankarao, Guntur*
2. *T. Anand Babu & Koteswari, Chilakaluripet*
3. *R. Suma Srinivas, Tirupati*
4. *T. Anna Mani, Gudiwada*
5. *B. Rupla & Malleswari, Nandigama.*

# స్వపరీక్ష అవసరం



‘యాత్రికుని ప్రయాణం’ రాసిన జాన్ బన్యన్ గొప్ప విశ్వాస వీరుడు. సువార్త ప్రకటించుటే తన వృత్తిగా చేసుకొని, విరామం లేకుండా దైవ పరిచర్యలో ప్రయాసపడ్డాడు. తన దేశమైన ఇంగ్లాండ్‌లోని ఒకపల్లె ప్రాంతంలో సువార్త ప్రకటిస్తుంటే ‘ఇంగ్లాండ్ సంఘ ఆరాధనకు’ విరోధంగా బోధిస్తున్నాడనే నెపంతో పోలీసులు ఆయనను నిర్బంధించి, 12 సం॥లు చెరసాలలో ఉంచారు. పరిస్థితులు ఎంతో విషమంగా ఉన్నా, దేవుని కోసం ధైర్యంగా నిలిచి, గొప్ప శ్రమలు అనుభవించాడు.

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఇంతటి గొప్ప విశ్వాస వీరుడు, తన హృదయంలో దేవునికి ఇష్టం కానివి, దేవునికి హేయమైన ఏడు విషయాలున్నట్లు కనుగొన్నానని తన సాక్ష్య పుస్తకం ‘ప్రధాన పాపికి చూపబడిన అపరిమితమైన కృప’ (Grace abounding to the chief of sinner) లో రాస్తాడు. అవేవనగా...

1. అపనమ్మకానికి చోటివ్వడం 2. క్రీస్తు ప్రేమ, దయా, కనికరములను హఠాత్తుగా మరచిపోవడం 3. ధర్మశాస్త్ర క్రియలవైపు దృష్టిసారించడం 4. ప్రార్థనకు మోకాళ్ళుపెట్టి మనస్సు ఎక్కడెక్కడికో పచార్లు చేస్తూ, నీరసంగా ప్రార్థించడం 5. ప్రార్థనా ఫలితం కోసం ఎదురుచూడక మరచిపోవడం 6. దేవుడిచ్చిన దాన్ని నిందించడం, లేనిదాని కోసం గొణగడం 7. అవినీతి విషయాల్లో రాజీపడి దేవుని ఆజ్ఞలను నెరవేర్చడంలో విఫలమవటం.

తన హృదయంలోనున్న ఈ హేయమైన వాటి గురించి జాన్ బన్యన్ ఎంతో పశ్చాత్తాపపడుతూ ఈ విధంగా రాశాడు: ఈ సంగతులు నా హృదయంలో ఉన్నాయని కనుక్కోవడం వల్ల – నన్ను నేను అసహ్యించుకొనేలా చేసి, నా హృదయాన్ని నేను నమ్మకుండా నిరోధించేవి. నాలో నీతి లేమి (కొరత)ని నాకు చూపించి, యేసునొద్దకు పరుగెత్తే అవసరాన్ని చూపించేవి. ప్రార్థనలో మెళకువగా ఉండమని ఒత్తిడి చేస్తూ, సాతానును జయించటానికి సహాయం చేయమని దేవునిని అడిగేవానిగా పురిగొల్పేవి.

ఈ కడవరి దినాల్లో ఉంటున్న మనం ఒక్కసారి మనల్ని మనం జాన్‌బన్యన్‌వలె లోతుగా పరీక్షించుకొందాం. మన హృదయాల్లో గూడుకట్టుకొనిపోయిన హేయమైన విషయాల మాటేమిటి? వాటిని కనుగొనడానికి జాన్ బన్యన్‌వలె ఎప్పుడైనా ప్రయత్నించామా? లేక ప్రార్థించామా? హేయమైనవాటిని దేవుడు మనకు బయలు పరచినప్పుడు లేక మనస్సుకు తెలియజేసినప్పుడు మనం ఏం చేస్తున్నాం? వాటిని మన హృదయంలో ఉంచుకొనే పరిచర్యలో పాల్గొంటున్నామా? ప్రార్థనా కూడికలకు, రిట్రీట్‌లకు హాజరౌతున్నామా? సువార్త పరిచర్యలో ప్రయాసపడుతున్నామా? పరిశీలించుకొందాం! అనేక సార్లు దేవునికి హేయమైన వాటిని హృదయంలో ఉంచుకొని జీవితాన్ని కొనసాగిస్తున్న ఫలితంగా వ్యక్తిగతంగాను, కుటుంబపరంగాను, దేవుని సేవలోను నాణ్యత, పరిపక్వత లోపించి, ప్రభువుకు మహిమతీసుకురాని జీవితాలుగానే మిగిలిపోతున్నాం.

దేవుడు మన హృదయాలను లక్ష్యపెట్టేవాడు. మన హృదయాల్లో పాపం లక్ష్యంచేస్తే, ప్రభువు మనం చెప్పేదాన్ని, చేసేదాన్ని అంగీకరించడు (కీర్త 66:18; 1 సమూ 16:7). కాబట్టి ఇప్పటికైనా హేయమైన వాటిని, దేవునికి ఇష్టంలేనివాటిని (సామె 6:16) సరిదిద్దుకోవడానికి శుద్ధహృదయం దయచేయమని, అంతరంగంలో స్థిరమైన మనస్సును నూతనంగా పుట్టించమని అడుగుదాం. లోతైన పశ్చాత్తాపంతో ప్రార్థిస్తే, విరిగి నలిగిన హృదయాలను అలక్ష్యం చేయని దేవుడు (కీర్త 51:10,17) జాన్ బన్యన్‌ని కరుణించినట్లుగా మనల్ని కూడా కరుణించి, ఈ తరానికి కృపాసాధనములుగా వాడుకొంటారు.

– విజే డెస్క్



# విశ్వాసమును బట్టి

"విశ్వాసమును బట్టి" అనే మాట హెబ్రీయులకు రాసిన పత్రిక 11వ అధ్యాయంలో ఎన్నిసార్లుందో మీరెప్పుడైనా లెక్కించారా? పరిశీలనాత్మక బైబిల్ ధ్యానం ప్రకారం ఒక అధ్యాయంలోగాని, వాక్యభాగంలోగాని ఒక పదం మాటిమాటికి రిపీట్ అవుతుంటే ఆ పదం ఆ వాక్యభాగం యొక్క మూలాంశమవుతుంది. ఆ పదాన్ని మన అన్వయింపులోనూ ఉపయోగించాల్సి వస్తుంది.

హెబ్రీపత్రిక 11వ అధ్యాయంలో 'విశ్వాసమును బట్టి' అనే పదాన్ని అబ్రహాముకు మూడుసార్లు, శారాకు ఒక్కసారి ఉపయోగించారు. ఈ అంత్యదినాల్లో ఇది మనకొక హెచ్చరిక. తక్షణం మనం మేల్కోవడం మంచిది.

## 1. అబ్రహాము విశ్వాసమును బట్టి పిలుపుకు విధేయత

దేవుని పిలుపుకు విధేయత చూపాడు. అబ్రహాముకు దేవుని వాక్కు రెండుసార్లు ప్రత్యక్షమైంది. మొదట తన స్వదేశమైన 'ఊరు' నుండి, రెండవసారి 'హారాను' నుండి దేవుడు పిలిచాడు. అబ్రహాము ముసలివాడైన తన తండ్రితో కలిసి ఆ ప్రాంతానికి వచ్చి, ఆ సమయంలోనే చనిపోయిన తన తమ్ముడైన హారాను పేరు మీద ఆ పట్టణానికి హారాను అనే పేరు పెట్టాడు. అక్కడ వ్యాపారం చేసి బహు ధనవంతుడయ్యాడు, ఎంతో సంపాదించాడు. ముసలివాడైన తండ్రి చనిపోయిందాకా దేవుడు ఆగి మరల అబ్రహామును పిలిచాడు. అలా హారానునుండి రెండవసారి దేవుని పిలుపు అందుకున్నాడు.

ప్రియస్నేహితుడా దేవునికి విధేయత చూపకుండా నిన్ను అడ్డగిస్తున్నదేది? ఐహిక విచారాల్లోను, సంపాదించడంలోనుపడి ఎంతకాలం దేవుడిచ్చిన సమయాన్నిపాడుచేసుకొంటావు. పేరుప్రతిష్ఠలు సంపాదించుకోవడంపైనే దృష్టిపెట్టి ఎంతకాలం ఈ ప్రపంచంతో రాజీపడిపోతావు? ఆలోచించు.

దేవుని పిలుపు నీకుందా? దానికి నీవు సాక్ష్యం చెప్పగలవా? దేనికోసం ఆయన నిన్ను పిలిచాడు? సువార్త చెప్పడానికా? ఆత్మలను రక్షించడానికా? నీ ఉద్యోగంలో నమ్మకంగా ఉండడానికా? మరి ఆ పిలుపుకు నీవు విధేయత చూపుతున్నావా? విశ్వాసము, విధేయత రెండూ స్వతంత్రమైనవి. అయితే ఆ రెండూ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి.

అబ్రహాము తన విశ్వాసాన్ని చేతల ద్వారా చూపాడు. వారసత్వంగా తనకు సంక్రమించబోయే ప్రదేశానికి వెళ్ళాడు. మరి నీ వారసత్వమెక్కడవుంది. ఈ ప్రపంచంలో నీకు సంక్రమించిన వాటితోనే తృప్తిపడుతున్నావా? మన వారసత్వం ఇహపరమైనది కాదు మన వారసత్వం పరలోకంలో ఉంది. అది శాశ్వతమైంది. మనం క్రీస్తుతోడి వారసులం.

అబ్రహాము విశ్వాసం తెగింపుతో కూడినది. ఒంటరిగానే దేవునివైపు చూశాడు. ఆయన



**నిన్ను నీవు సంపూర్ణంగా అప్పగించుకోవడానికి అడ్డంకి ఏమిటి? నీ టాలెంట్స్, దేవుడిచ్చిన కృపావరాలు, నీకున్న బెస్ట్ అంతటిని బలిపీఠంపై ఆయన ఎదుట పెట్టు. బలిపీఠంపై పెట్టినవి మనకు చెందినవి కావు.**

నడిపింపుపై ఆధారపడ్డాడు. దేవుని వాక్యప్రోత్సాహంతో కనిపించని దేవునిపై ఆధారపడగలిగే తెగువ నీలో ఉందా? ఆయనను కనిపెట్టలేకపోయినా ఆయన్ను విశ్వసించగలం, అవునా!

## 2. విశ్వాసంతో అబ్రహాము గుడారాల్లో నివసించాడు

విశ్వాసమును బట్టి జీవించిన ఆయన గుడార జీవితంలో మూడు విషయాలు మనం గమనించగలం.

1) ఈ శరీరంతో నివసించే జీవితం (గుడారం)

2) అస్థిర నివాసాన్ని సూచిస్తుంది (అశాశ్వతం)

3) మనం ఈ ప్రాంతానికి చెందిన వారం కాము (పరదేశులము, యాత్రికులము)

నీ జీవితం ఎలాగుంది? నీ సమయాన్ని ఎలా గడుపుతున్నావు? నీ సుఖాల కోసం ఎక్కువ సమయాన్ని కేటాయిస్తూ దేవుని కోసం కొద్ది సమయాన్ని ఇస్తున్నావా?

దేవుని సేవకులు ఎంతోమంది కష్టాలుపడుతుంటే నీవు మాత్రం విలాసవంతమైన జీవితం గడుపుతున్నావా? అలాగయితే దేవుని సేవకునిగా నిన్నెంతమాత్రం నీవు ఎంచుకోకూడదు.

నీ సమయాన్నెలా గడుపుతున్నావు? ఎనభైశాతం నీ విలాసాలకోసం, ఆనందం కోసం వెచ్చిస్తూ ఇరవైశాతం అంతకంటే తక్కువ సమయం మాత్రమే దేవుని రాజ్యవ్యాప్తి కొరకు కేయిస్తున్నావా? ప్రార్థన, వాక్యధ్యానాల కోసం ఎంత సమయం ఇస్తున్నావు?

నీ గుడార జీవితమెలాగుంది? ఆకానులాగా శపితమైనవి దాచుకొంటున్నావా? నీ గుడారం పరిశుద్ధాత్మునికి నివాసస్థలంగా ఉందా? లేదా దురాశ, నేరారోపణలు, లేనివి కల్పించి చెప్పే మాటలు లాంటివి చోటుచేసుకొంటున్నాయా? అలాగైతే ఇప్పుడే పశ్చాత్తాపపడు.

## 3. విశ్వాసాన్ని బట్టి అబ్రహాము ఇస్సాకును అర్పించాడు

తన ఏకైక ఆనందాతిశయమైన స్వంత కుమారుని బలిపీఠం మీద అర్పించి తిరిగి పొందుకొన్నాడు. పరీక్షలో నెగ్గాడు.

ప్రియస్నేహితుడా, నిన్ను నీవు అప్పగించుకోవడమే క్రీస్తులోని నూతన జీవితం రహస్యం. మన పాత జీవితం క్రీస్తునందు సిలువ వేసి బలిపీఠంపై అర్పించినప్పుడు ప్రభువు అంగీకరించి నూతనమైనదిగాను పునరుత్థానబలముతోను నింపుతాడు.

ఆయన తన వాగ్దానాల ద్వారా మనకు అనుగ్రహించే ఆశీర్వాదాలను సంతోషంగా స్వీకరిస్తాముగాని మనం అతిశయించే వాటిని ఆయన ఎదుట బలిపీఠంపై అర్పించడంలో విఫలమవుతుంటాము. విశ్వాసమును బట్టి అబ్రహాము తన కుమారుని మీద కత్తి ఎత్తి, దేవుని కృపను బట్టి అతనిని తిరిగి పొందగలిగాడు. దేవుడు తిరిగి లేపగల సామర్థ్యం గలవాడని నమ్మాడు.

నిన్ను నీవు సంపూర్ణంగా అప్పగించుకోవడానికి ఆటంకాలు ఏమిటి? నీ టాలెంట్స్, దేవుడిచ్చిన కృపావరాలు, నీకున్న బెస్ట్ అంతటిని బలిపీఠంపై ఆయన ఎదుట పెట్టు. బలిపీఠంపై పెట్టినవి మనకు చెందినవి కావు.

విశ్వాసమును బట్టి అబ్రహాము విధేయతతో కూడిన జీవితాన్ని జీవించాడు (రోమా 6:16), నమ్మకమైన జీవితాన్ని జీవించాడు (2 తిమో 4:5), దేవునికి లోబడి జీవించాడు (రోమా 12:1, 6:13) వినయం, విధేయత, అభ్యాసాల ద్వారా విశ్వాసం పెంపొందుతుంది. వెలిచూపు వలన కాక విశ్వాసం ద్వారా నడుచుకొందాము.

– **జక్కి దేవరాజు**, విజయవాడ

# ఇచ్చే హృదయాన్ని పెంపొందించుకోవటం

క్రీస్తునందు అతి ప్రియమైన యుఇయస్ఐ–ఏపి కుటుంబ సభ్యులకు, కోశాధికారులకు, ప్రార్థనా సహకారులకు మన ప్రభువైన యేసుక్రీస్తు నామములో వందనాలు.

పరలోకమందు మీ కొరకు ధనమును కూర్చుకొనుడి; అచ్చట చిమ్మెటయైనను, తుప్పైనను దాని తినివేయదు, దొంగలు కన్నము వేసి దొంగిలరు! నీ ధనము యెక్కడనుండునో అక్కడనే నీ హృదయము ఉండును! – మత్తయి 6:20–21

పరలోకమందు ధనమును కూర్చుకోవటం అనగా దశమ భాగాలకు పరిమితమవ్వటం కాదు గానీ అన్నింటిలో దేవునికి విధేయత చూపడం. దేవుని పని కొరకు ధనం ఇవ్వడం, పరలోకంలో పెట్టుబడి పెట్టడమే. కానీ మన లక్ష్యం, మన చేసే పనులన్నింటిలో దేవుని ఉద్దేశాలను నెరవేర్చేటట్లు చూచుకోవాలి, కేవలం ధనం విషయంలో మాత్రమే కాదు. పరలోకంలో కూర్చబడే ఈ ధనానికి లూకా 12:33లో అక్షయమైన ధనంగా చెప్పాడు. ఈ ధనాన్ని గురించిన వర్ణనలో రూపకాలంకారం వాడబడింది. అయితే నీ ధనమెక్కడనుండునో నీ హృదయమును అక్కడనే ఉండును అని ప్రభువు చెప్పినప్పుడు, పరిశుద్ధలేఖనాలలో హృదయం అనగా ఒక్కరు ఏమైయున్నారు అన్న విషయానికి కేంద్రం, ఒకని బలమైన కోర్కెలను, భావోద్రేకాలను, హేతువును మరియు చిత్తాన్ని ప్రతిబింబిస్తుంది. కావున మంచి క్రైస్తవ గృహనిర్వాహకుడు దేవుడు నమ్మి బహుమానాలుగా అప్పగించిన మూడు 'టి' లను, సమయం (టైమ్), తలాంతులు (టాలంట్స్), ధనం (ట్రెజర్)లను ప్రణాళికాబద్ధంగా, వృద్ధిచెందిన కొలది ఆయన సేవలో మానవాళి అందరికి లాభం చేకూర్చేవిధంగా, క్రీస్తు విమోచన ప్రేమకు కృతజ్ఞతగా మరలా ఆయన ఇచ్చిన దానిలోనుంచి ఆయనకే ఇస్తాడు. కావున విద్యార్థుల మధ్య దేవుని రాజ్యం విస్తరణ కొరకు ఇచ్చే హృదయాన్ని అభివృద్ధి చేసుకొని, మంచి క్రైస్తవ గృహనిర్వాహకులంగా ప్రభువును ఘనపరుద్దాం.

*గమనిక: ఏసియం–2021 నిర్ణయం ప్రకారం ఇయు, ఇజియఫ్‌లలో ధనం మిగిలుంటే దానిలో అవసరాల నిమిత్తం 20% ఉంచుకొని మిగిలినది నంబూర్ ఆఫీస్‌కు పంపగలరు.*

**స్తుతించండి**

1. మన స్టాఫ్‌కు 100% శాలరీ, అలవెన్స్‌లు ఇవ్వడానికి ప్రభువు చూపిన కృపను బట్టి

**ప్రార్థించండి**

1. యుఇయస్ఐ–ఏపి ఏసియం–2021 తర్వాత పెరిగిన 18% బడ్జెట్‌కు అనుగుణంగా 42 ఇజియఫ్‌లు కాంట్రిబ్యూషన్స్ పెంచి పంపిస్తున్నాయి. వారికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము. మిగిలిన ఇజియఫ్‌లు కూడా ప్రార్థించి సహకరించవలసిందిగా కోరుచున్నాము.
2. యుఇయస్ఐ నేషనల్‌కు ప్రతి నెల ఆఫీస్ నుంచి పంపే కాంట్రిబ్యూషన్స్ 75,000/– నుంచి 80,000/– రూ. పెంచడానికి స్టేట్ యాన్యువల్ కౌన్సిల్‌లో నిర్ణయించారు. పెరిగిన 5,000/– కొరకు
3. స్టైరెట్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కోసం 8 లక్షలు, చాందపిళ్ళ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కొరకు 5 లక్షలు అవసరం
4. యాన్యువల్ ఇంక్రిమెంట్, నూతన కో–ఆర్డినేటర్స్ నియామకాల వలన అవసరమైన అదనపు ధనం 60 వేల కోసం
5. స్టాఫ్‌కు ఐదు ల్యాప్‌టాప్‌లు సబ్సిడీలో ఇవ్వడానికి అవసరమైన 1,20,000/– కొరకు

ఇట్లు
క్రీస్తులో మీ సహోదరుడు

**యస్.ఆర్.డి. కిషోర్ కుమార్**

**AP MONTHLY REQUIREMENT – Rs. 11,10,000/- (18% Hike W.R.T present income)**

**APRIL 2022**

| Receipts | | Payments | |
|---|---|---|---|
| General Fund | 9,79,486.00 | Field Staff Salaries | 4,51,416.00 |
| Staff Support | 46,000.00 | Field Staff HRA, CA, MA & TA | 2,27,042.00 |
| | | Office Staff Salaries | 1,43,745.00 |
| | | UESI | 80,000.00 |
| | | Rajasthan | 30,000.00 |
| | | Jammu & Kashmir | 15,000.00 |
| | | APEGF | 3,000.00 |
| | | Office Expenditure | 19,941.00 |
| | | to SWF | 55,000.00 |
| | | Closing Balance | 342.00 |
| **Total** | **10,25,486.00** | | **10,25,486.00** |

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2021-2023**

**Date of Printing: 25-05-2022**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508

# ఓటమి పాఠం

నేను...ఓటమిని
నీకు తెలియడ్నివాణ్ణి కాను
నీవు సరిగ్గా తెలుసుకోని వాణ్ణి

శత్రువుగా నీవు పొరబడే ప్రాణమిత్రుణ్ణి
పరాయివాడిగా నీవు భావించే పరాజయాన్ని

ఆప్యాయంగా నీ భుజంమీద
చెయ్యివేసినప్పుడు
ఆకాశం మీదపడినట్టు
అదిరిపోతావు

పరామర్శగా నేను పలకరించినప్పుడు
ఆఖరిగంట మోగినట్టు
చక్కని జీవితాన్ని
చదవకుండానే మూసేస్తావు

గెలుపుబాణాన్ని ఎక్కుపెట్టి
గమ్యంవైపు చూడాల్సిన నీవు
గురితప్పుతున్నావని గుర్తుచేయడానికే
నేనొస్తాను

కలల వేటలో నీ కఠోరదీక్ష
కుంటుపడిందన్న విషయం
నీ కంట్లో పడాలనే నా కోరిక

వేవేల అనుభవాల సారాన్నై
ఎవరూ బోధించలేని పాఠాన్నై
దిద్దుకోవాల్సిన లోపాన్ని చూపించి
ఎదగాల్సిన ఎత్తుల్ని వివరించి
నిన్ను పరిపూర్ణున్ని చేయాలనే
నేను పరితపిస్తాను

ఒడిదుడుకుల జీవితాన్ని
నిబ్బరంగా ఎదుర్కొనే
భీమా పత్రాన్ని నీ చేతిలో పెట్టడానికే
నీ తలుపు తడతాను

గెలుపును నీకు దూరం
చేయడానికి కాదు
గెలవాలనే కసిని నీలో
పెంచడానికే నేను కనబడతాను

నువ్వు అధిరోహించబోయే
పర్వత శిఖరాల మలపుల్లో
నీ పాదం కింద మెట్టునై
నేను నిలబడతాను

– డా. తాళ్ళూరి ప్రసాద్